'సోమశిల'కు 16,452 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 16,452 క్యూసెక్కుల వరద వస్తోంది. డ్యాంలో 60.736 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 300 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక ఉదయగిరి మండలంలోని గండిపాళెం జలాశయం నీటిమట్టం 12 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ కె.చంద్రమౌళి తెలిపారు. జలాశయం సామర్థ్యం 35 అడుగులు కాగా ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా వరద వచ్చి చేరినట్లు ఆయన తెలిపారు.



భగత్‌సింగ్‌కాలనీ సమీపంలోని పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు దిగిన వందలాది ట్రాక్టర్లు

పెన్నాలో రయ్.. రయ్!

● ఉచిత ఇసుక నిర్ణయంతో సందడిగా తీరం ● భారీగా తగ్గిన ట్రాక్టర్ ఇసుక ధర

మొన్నటిదాకా నిర్మానుష్యంగా ఉన్న పెన్నాతీరం ట్రాక్టర్లు, ఎండ్లబండ్ల రాకపోకలతో సందడిగా మారిపోయింది. వెంకటేశ్వరపురం సమీపంలోని భగత్‌సింగ్‌కాలనీ, పాత మున్సిపల్ కార్యాలయం, దీనదయాల్‌నగర్, బొడిగాడితోట ప్రాంతాల్లో ఇసుక కోసం ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు క్యూ కట్టాయి. తమ సొంత ట్రాక్టర్లతో కూలీలను పెట్టుకొని ఎక్కడైనా ఇసుక తవ్వకాలు చేసుకోవచ్చని ఇటీవల సీఎం చంద్రబాబు ఆదేశాలతోపాటు రాష్ట్ర మంత్రి నారాయణ సైతం దృష్టి పెట్టడంతో నగరవాసులకు ఇసుక సమస్యకు పరిష్కారం ఏర్పడినట్టు అయ్యింది. బుధవారం భగత్‌సింగ్‌కాలనీ రీచ్‌లోకి ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు భారీగా తరలివచ్చాయి. మొన్నటిదాకా ట్రాక్టర్ ఇసుక రూ.5వేల నుంచి 6వేల వరకు విక్రయించారు. ఒక్కసారిగా ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వడంతో ధరలు పడిపోయాయి. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1600 నుంచి దూరాన్ని బట్టి రూ.3వేల వరకు తీసుకొంటున్నారు. నగరంలోని మిగతా రీచ్‌లలోనూ ఇదేవిధంగా ఇసుక తరలింపు ప్రారంభమైతే ధరలు మరింత దిగి వచ్చే అవకాశం ఉంటుంది.



అరె.. టైరు దిగబడిపోయింది.. నెట్టు!

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)

పరిహారం రెండింతలు

● వన్యప్రాణుల దాడిలో చనిపోతే రూ.10లక్షలు

● పంటల నష్టానికి రెండింతల చేసిన ప్రభుత్వం

పరిహారం పెంపు ఇలా (రూ.లలో)

విభాగం	ప్రస్తుతం	పెంపు
మనిషి చనిపోతే	5 లక్షలు	10 లక్షలు
తీవ్ర గాయాలు	75 వేలు	2 లక్షలు
స్వల్ప గాయలు	ఉచిత చికిత్స	ఉచిత చికిత్స/రూ.20వేలు
పశువులు చనిపోతే	మార్కెట్ ధర	పశుసంవర్ధక శాఖ అంచనా
వరి (ఎకరాకు)	6 వేలు	10 వేలు
చెరకు	6 వేలు	12 వేలు
పప్పుదినుసులు	6 వేలు	10 వేలు
మామిడి, టెంకాయ (చెట్టుకు)	1500	2వేలు
పండ్లతోటలు (ఎకరాకు)	7500	12వేలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణుల దాడిలో ప్రాణ, ఆస్తి నష్టానికి అందించే పరిహారం రెట్టింపు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ అడవి జంతువుల కారణంగా మనుషుల ప్రాణనష్టం జరిగితే రూ.5లక్షలు ఇస్తుండగా దానిని 10 లక్షలకు పెంచారు. తీవ్ర స్వల్పగాయాల బారిన పడిన వారికీ రెట్టింపు పరిహారం ఇవ్వనున్నారు. అలాగే, పశుసంవర్ధక శాఖ అంచనాలను బట్టి పశునష్టానికి పరిహారం ఇవ్వనున్నారు. వరితోపాటు అన్ని రకాల పప్పుదినుసులు, పండ్లతోటలకూ పరిహారం పెంచారు.

కంగ్రాట్స్ సార్!



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టిడ్కో చైర్మన్‌గా జనసేన పార్టీ మీడియా అధి కార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ అమరావతిలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారాయణ కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ తన గురువు నారాయణ వద్ద చదువుకున్న తాను ఆయన శాఖలోనే పని చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అలాగే జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిశోర్, సుజయ్, కారంపూడి కృష్ణారెడ్డి గుర్రం కిషోర్, మంచికంటి శ్యామ్ తదితరులు అజయ్‌కుమార్‌ను సత్కరించారు.

INTERVIEW



నెల్లూరు బాగుందని అందరూ అనాలి

'ఆంధ్రజ్యోతి'తో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ

నెల్లూరువాసులు ఎక్కడున్నా మా సిటీ బాగుందన్న మాట ప్రతీనోటా రావాలన్నదే నా ప్రణాళిక. అందుకు అనుగుణంగా ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించేందుకు రూపకల్పన జరుగుతోంది.' అని నగర పాలక సంస్థ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అన్నారు. పారిశుధ్యం మెరుగుపరచడంతోపాటు పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటున్నాము. అయితే, మేం ఎంత చేసినా నగరవాసుల్లో చైతన్యం వస్తేనే అనుకున్నది సాధ్యమవుతుంది.' అని కమిషనర్ అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే ఆయన మాటల్లోనే..

6



నిరక్షరాస్యుల కోసం 'ఉల్లాస్'

● మహిళల్లో అక్షరాస్యత పెంపే లక్ష్యం

మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులోభాగంగా కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ)ను రాష్ట్రంలో ఉద్యమంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. జిల్లాలో అమలుకు సంబంధించి ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేయగా, నిరక్షరాస్యులైన 19,178 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. వచ్చేఏడాది, మార్చి 31వతేదీ నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకునేలా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

6

పోలియోను పూర్తిగా తరిమేద్దాం

- వివరాలు 7లో..



బుచ్చి మండలం సాల్మాన్‌పురం సమీపంలో పూడిక, గుర్రపు డెక్కతో నిండిపోయిన పంటకాలువ

ఎందుకింత నిర్లక్ష్యం?

ఓఅండ్ఎం పనులకు టెండర్లు పిలవడంలో జాప్యం

ప్రభుత్వం జీవో ఇచ్చి పది రోజులైనా కదలని ఇరిగేషన్

ఇంకా కొన్ని సెక్షన్ల నుంచి అందని ఎస్టిమేషన్లు

అసలే ఆలస్యం అనుకుంటే.. ఇప్పుడు ఇంకా సాగదీత

సీజన్ సమీపిస్తుండటంతో రైతాంగంలో ఆందోళన

నెల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న సామెతలా మారింది. జిల్లాలోని రైతాంగం పరిస్థితి. గడిచిన మూడు సీజన్లుగా పూడిక తీయక రూపుకోల్పోయిన కాలువలను బాగు చేసేందుకు కూటమి ప్రభుత్వం అత్యవసర పనుల కింద నిధులు మంజూరు చేసినా ఇరిగేషన్ అధికారుల్లో మాత్రం కనిపిస్తోంది. మరో వారం రోజుల్లో రబీ (లేట్ ఖరీఫ్) సీజన్ ప్రారంభం కానుంది. నార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కానీ ఇంతవరకూ పంట కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగించలేదు. ఈ పనులకు కనీసం ఇప్పటికి టెండర్లు కూడా పిలవలేదు. ఇంకా ఎస్టిమేషన్లు తయారీలోనే ఇరిగేషన్ ఏఈలు ఉన్నారు. వీరి నుంచి ఎస్టిమేషన్లు తెప్పించుకొని టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారు.

● ఎస్టిమేషన్ల తయారీలో జాప్యం

రబీ ప్రారంభంలోపు ఈ పనులు పూర్తి చేసేందుకు వీలుగా ఎమ్మెల్యేలు ఎస్టిమేషన్లు తయారు చేయించారు. వాటిని ప్రభుత్వానికి పంపారు. అయితే అక్కడ ఫైనాన్స్ అప్రూవల్ రావడంలో చాలా ఆలస్యమైంది. రెండు నెలల తర్వాత ఈ నెల 10వ తేదీన ఈ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఓఅం డ్ఎం పనులకు ఆ హెడ్‌లో నిధులు లేకపోవడంతో రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం విపత్తు నిర్వహణ ఫండ్ నుంచి ఓ అండ్ఎం పనులకు అప్రూవల్స్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.283 కోట్లకు అనుమతులు ఇవ్వగా జిల్లాకు రూ.46 కోట్లు కేటాయించారు. అందులో రెగ్యులర్ సర్కిల్‌కు రూ.28 కోట్లు కేటాయించగా, సోమశిలకు రూ.14 కోట్లు, తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.4 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేశారు. సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కాబట్టి రెగ్యులర్ సర్కిల్ కిందనే కాలువల నిర్వహణ ఎక్కువగా చేయాల్సి

- మిగతా 6లో..

మంజూరైన పనుల వివరాలు (రూ.లక్షల్లో)

నియోజకవర్గం	పనులు	మొత్తం
ఆత్మకూరు	25	177.87
గూడూరు	3	9.8
కావలి	74	483.25
కోవూరు	97	540.62
నెల్లూరు రూరల్	80	606.38
సూళ్లూరుపేట	9	21.4
సర్వేపల్లి	134	873.95
ఉదయగిరి	8	35.93
వెంకటగిరి	6	50.05
మొత్తం	436	2799.25

అనంతసాగరం తహసీల్దారుపై వేటు!

పొదలకూరులో విచ్చలవిడిగా అక్రమాలు

వైసీపీ పెద్దల ఆదేశాలతో భూ పందేరం

ప్రజలు, టీడీపీ నేతల ఫిర్యాదుతో విచారణ

వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేసిన కలెక్టర్

హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లొద్దని ఆదేశాలు



వీరవసంతరావు

పొదలకూరు/ అనంతసాగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకులు చెప్పినట్లు తూ.చా తప్పకుండా పాటించి, అవినీతి ఊబిలో కూరుకుపోయిన అధికారులపై ఇప్పుడు వేటు పడుతోంది. పొదలకూరు పూర్వపు ప్రస్తుత అనంతసాగరం తహసీల్దారు వీరవసంతరావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పొదలకూరులో 2023 జూన్ 14 నుంచి 2024 జూన్ 5వతేదీ వరకు తహసీల్దారుగా వీరవసంతరావు పనిచేశారు. ఆయన పని చేసిన ఏడాది కాలంలో నిబంధనలకు విరుద్ధంగా భూ అక్రమాలు

- మిగతా 6లో..

'గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పేదవాడి సొంతింటి కలను తాము నెరవేరస్తున్నాము. అక్కచెల్లెమ్మలకు ఆస్తులు ఇస్తున్నాం. కాలనీలు కాదు ఊర్లు నిర్మిస్తున్నాం' అంటూ గత ప్రభుత్వంలో ఆర్భాటంగా నేతలు ఊకదంపుడు ప్రసంగాలు చేశారు. అయితే ఆ ఇళ్ల నిర్మాణం వెనుక భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని లెక్కలతో సహా వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. పేదలకు సొంతింటి కల నెరవేర లేదు గానీ, కోట్లకు కోట్లు నిధులు మాత్రం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లాయి.

అత్యధికంగా 'ఆత్మకూరు'లో రూ.7.5 కోట్ల అవినీతి

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల మెడకు బిగుస్తున్న ఉచ్చు

జగనన్న లేఅవుట్లు..

అక్రమాల గుట్టలు

విజిలెన్సు విచారణతో వెలుగులోకి..

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాదాపుగా 650 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేశారు. తొలివిడతలో అప్పటి ప్రభుత్వం 54,034 గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఒక్కో ఇంటికి రూ.1.80లక్షలు మంజూరు చేస్తున్నామని, గృహాల ను లబ్ధిదారులు కట్టుకోలేకపోతే అధికారులే నిర్మించి ఇస్తారని, లేనిపక్షంలో కాంట్రాక్టర్లే కడతారని ప్రకటించింది. చివరికి కాంట్రాక్టర్లతోనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించింది. వారంతా అప్పటి వైసీపీ నాయకులు, కార్యకర్తలే కావడం విశేషం. దీంతో నిర్మాణాలు పూర్తి కాకుండానే భారీగా నిధులను దిగమింగేశారు. దీనిపై అప్పట్లోనే పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

● విజిలెన్సు విచారణతో వెలుగులోకి..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గృహ నిర్మాణాల్లో అక్రమాలపై విజిలెన్సు విచారణకు ఆదేశించింది. జిల్లాలోని సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో విజిలెన్సు అధికారులు విచారణ చేపట్టారు. పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు, అదనపు బిల్లుల చెల్లింపుతోపాటు సిమెంట్, స్టీలు వినియోగంలోనూ భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఆత్మకూరు నియోజక వర్గంలో రూ.7.5 కోట్లు, ఉదయగిరిలో రూ.6 కోట్లు, సర్వేపల్లిలో రూ.7కోట్లు, కావలిలో రూ.3.12 కోట్లు, కోవూరులో రూ.7.13కోట్లు, నెల్లూరు రూరల్‌లో రూ.76లక్షలు, వెంకటగిరిలో రూ.2.29కోట్లు, కందుకూరులో రూ.1.23కోట్ల మేర నిధులు దుర్వినియోగమయ్యాయని, వీటన్నింటినీ రాబట్టాలని విజిలెన్సు అధికారులు నివేదికలో పేర్కొన్నారు.



వెంకటాచలంలోని జగనన్న లే అవుట్‌లో గృహాలు

● నేతల చుట్టూ ప్రదక్షిణ

పేదల పక్కా ఇళ్ల అక్రమాలకు సంబంధించి ప్రధాన బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లదేనని, వారందరికీ నోటీసులు జారీచేసి రాతపూర్వక వివరణ తీసు కోవాలని, అక్రమాలకు బాధ్యులపై చర్యలు చేపట్టాలని విజిలెన్సు

- మిగతా 6లో..

వైభవంగా కుర్తాళం పీఠాధిపతి శోభాయాత్ర



నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠం అధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, తిరుపతి శక్తి పీఠం అధినేత్రి రమ్యానంద భారతీ స్వాగత శోభాయాత్ర బుధవారం సాయంత్రం నెల్లూరులో వైభవంగా జరిగింది. పప్పులవీధిలోని సౌభాగ్య సరస్వతి అమ్మవారి నూతన ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకాలకు వారు విచ్చేశారు. పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో పీఠాధిపతులకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అయ్యప్పగుడి నుంచి పడారుపల్లి గంగమ్మ దేవాలయం మీదుగా సౌభాగ్య సరస్వతి ఆలయం వరకు శోభాయాత్ర సాగింది. అనంతరం భక్తులకు పీఠాధిపతులు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ మేనేజర్ మాచవోలు అనూరాధ, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



హోరాహోరీగా నర్సుల సంఘం ఎన్నికలు

● సత్యవతి ప్యానెల్ విజయం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు బుధ వారం హోరాహోరీగా జరిగాయి. ఈ ఎన్నికల్లో సత్యవతి ప్యానెల్ విజయం సాధించింది. నెల్లూరు లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గల నర్సింగ్ కళాశాలలో ఈ ఎన్నికలు నిర్వహించారు. సత్యవతి ప్యానెల్, వరలక్ష్మి ప్యానెల్ పోటీపడ్డాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. వరలక్ష్మి ప్యానెల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సతీమణి చిట్టెమ్మ జిల్లా ఉపాధ్యక్షులుగా పోటీలో ఉండటంతో ఆ ప్యానెల్‌కు ఎన్‌జీవో అసోసియేషన్ మద్దతు తెలిపి ప్రచారం చేసింది. సత్యవతి ప్యానెల్‌కు ఏపీజీఈఏ మద్దతు తెలుపుతూ ప్రచారం చేసింది. మొత్తం 219 ఓట్లకుగాను 207 ఓట్లు పోలయ్యాయి. జిల్లా అధ్యక్షురాలిగా యల్లపు సత్యవతి, కార్యదర్శిగా నెల్లిపూడి వసుంధర, కోశాధికారిగా అరుణకుమారి, ఉపాధ్యక్షురాలిగా సుమతి ఎన్నికయ్యారు. మరో 5 మంది కమిటీ సభ్యులు కూడా ఎన్నికయ్యారు. దీంతో సత్యవతి ప్యానెల్ జీజీహెచ్‌లో సంబరాలు చేసుకుంది.

ఘనంగా మహా సంప్రోక్షణ

● ముగిసిన పవిత్రోత్సవాలు



నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఉదయం హోమాలు, సాయంత్రం గోపురోత్సవం, మహాకుంభ ప్రోక్షణ జరిగాయి. పవిత్ర అవరోహణం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ఛైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈవో సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

మన కోనసీమ ఇదేనండీ!



పచ్చని చెట్ల నడుమ గ్రామం



మైపాడు తీరంలో సందర్శకుల సందడి

ఎత్తయిన కొబ్బరిచెట్లు.. పచ్చని మామిడి, అరటి తోటలు.. పక్షుల కిలకిలరావాలు... మనస్సును ఆహ్లాదపరిచే చల్లని గాలులు ఇందుకూరుపేట సొంతం. కొనసీమకే పరిమిత మైన ఈ అందాలు జిల్లావాసులను ఆకట్టుకుంటోంది. గలగలపారే కాలువల మధ్య రొయ్యలు, చేపల గుంట లకుతోడు వరి, ఉద్యాన పంటలూ విస్తృతంగా సాగవు తున్నాయి. ఇక ఇదే మండలంలో ఉన్న మైపాడు తీరం పర్యాటకులతో ఎప్పుడూ సందడిగా ఉంటోంది. నిత్యం పరుగు ప్రపంచంలో బిజీబిజీగా గడిపే వారంతా సెలవురోజుల్లో ఇక్కడకు వచ్చి సేద తీరుతుంటారు. పండుగ, ఇతర పర్వ దినాల్లో సముద్రంలో స్నానమాచరించి, సమీపంలో ఉన్న శివాలయంలో పూజలు చేస్తుంటారు. సందర్శకుల కోసం ఇక్కడ పర్యాటక శాఖకు చెందిన 16 రిసార్ట్స్ ఉన్నాయి. ఇక విడిది చేయాలనుకునే వారు ఆన్‌లైన్‌లో రిసార్ట్స్ బుక్ చేసు కోవచ్చు. అంతేగాక ప్రముఖ పుణ్యక్షేత్రాలైన గంగపట్నంఅ లోని శ్రీచాముండేశ్వరి దేవి, లేబూరులోని కుంకాలమ్మ ఆలయాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ఆలయాలకు మన రాష్ట్రం నుంచేగాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. రొయ్య పిల్లలను ఉత్పత్తి చేసే హేచరీలు అధిక సంఖ్యలో ఉన్న మైపాడు, కొరుటూరు గ్రామాలూ ఈ మండలంలోనే ఉన్నాయి. ఇన్ని అందాలను తనివితీరా చూడాలంటే మైపాడు బీచ్‌కు వెళ్లే రహదారిలో వెళ్లాల్సిందే. ఇంకెందుకు ఆలస్యం ఇందుకూరుపేటను ఓ లుక్కేయండి!

- ఇందుకూరుపేట, ఆంధ్రజ్యోతి



మైపాడుతీరంలో ఆకట్టుకునేలా రిసార్ట్



చాముండేశ్వరి అమ్మవారి ఆలయం



రోడ్డుకు ఇరువైపులా పచ్చనితోరణంలా చెట్లు

సాగరం తహసీల్దారుపై వేటు!

(5వ పేజీ తరువాయి)

జరిగాయని టీడీపీ నేతలతోపాటు మండలవాసులు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. తోడేరుకు పక్కనే ఉన్న మరుపూరులో నకిలీ పట్టాలు సృష్టించి ఊళ్లో లేనివారి పేరుతో భూముల నమోదు, ఆదాయపు పన్ను కట్టేవారు, భూస్వాములు, కోటీశ్వరులకు ప్రభుత్వ భూములు ధారాదత్తం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే తరహాలో పులికల్లులో 40 ఎకరాలు, ప్రభగిరిపట్నంలో 28 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించి ప్రభుత్వ భూముల స్వాహా చేశారు. పొదలకూరు మండల వ్యాప్తంగా ఇదే తరహాలో అక్రమాలు జరిగాయి. అసైన్‌మెంట్ రివ్యూ కమిటీ అనుమతి పొందకుండా, వీఆర్‌వో, ఆర్‌ఐ సంతకాలు లేకుండా, ఉన్నతాధికారులకు తెలియకుండానే వందల ఎకరాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి రూ.కోట్లలో దోపిడీ చేశారని ఆధారాలతో సహా టీడీపీ నాయకులు, బాధిత రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. కొండ పోరంబోకు, వాగు పోరంబోకు, మేత పోరంబోకులతో సహా ఏ ప్రభుత్వ భూములనూ వదిలిపెట్టలేదు. క్షేత్రస్థాయి విచారణలో భాగంగా రికార్డులను పరిశీలించే క్రమంలో జిల్లా ఉన్నతాధికారులు వీరవసంతరావు లీలలను చూసి విస్తుపోయారు. చేసిన తప్పులతో వీరవసంతరావు అడ్డంగా దొరికిపోవడంతో సస్పెన్షన్ చేయడంతోపాటు హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్లవద్దని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఎన్నికల అనంతరం అనంతసాగరం తహసీల్దారుగా విధుల్లో చేరిన వీరవసంతరావు ఇక్కడ కూడా మంచి పేరు తెచ్చుకోలేక పోయారు.

రేపటి నుంచి

బాలల హక్కుల కమిషన్ సభ్యురాలి పర్యటన

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 23 : ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బీ పద్మావతి శుక్ర, శనివారాల్లో జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పిల్లలతో డ్రగ్స్ అక్రమ రవాణాను నిరోధించడానికి జిల్లాలో అమలౌతున్న విధానాలను ఆమె పరిశీలిస్తారని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు, అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు. 26వతేదీ ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు విద్యాశాఖలోని అన్నీ విభాగాల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షిస్తారని పేర్కొన్నారు. ఆరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్థానికంగా ఉన్న వైద్యశాలలను, సచివాలయాలను సందర్శిస్తారని తెలిపారు.

నెల్లూరు బాగుందని

అందరూ అనాలి

- ఇదే నా ప్రణాళిక.. ఆ మేరకే కసరత్తు
- కొత్తగా 300 సీసీకెమెరాలతో పారిశుధ్యం పరిశీలన
- పోస్టర్ల నిర్మూలనకు రెండు ఫైరింజన్లతో డ్రైవ్
- 'ఆంధ్రజ్యోతి'తో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ



"నగరవాసులకు మంచినీరు, వీధిలైట్లు, డ్రైన్లు, రోడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు మొదలైంది. పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరుస్తూనే పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పుడున్న గ్రీనరీ కంటే మరింత పెంచేందుకు అవకాశాలు ఉన్నాయి. వాటిని పూర్తిగా వినియోగించుకోనున్నాం. పారిశుధ్య పనుల పర్యవేక్షణకు ఇప్పుడు సీసీకెమెరాలకు అదనంగా మరో 300 కెమెరాలను అమర్చనున్నాము. కమాండ్ కంట్రోల్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటాం. మేము ఎంత నూతన ప్రణాళికలతో ముందు కొచ్చినా ప్రజల్లో అవగాహన లేకపోతే ఫలితముండు.

● పోస్టర్ రహితానికి రెండు ఫైరింజన్లు

నెల్లూరులో పోస్టర్లు లేకుండా చేసేందుకు నిత్యం అగ్నిమాపక శాఖకు చెందిన రెండు ఫైరింజన్లతో పర్యవేక్షిస్తున్నాము. ఉదయం, సాయంత్రం పూట ప్రధాన కూడళ్లు, రోడ్లు, డివైడర్లు, గోడలున్న ప్రాంతాలలో ఈ వాహనాలు తిరుగుతూ పోస్టర్లు కనబడిన వద్ద ఆగి నీటినికొట్టి తొలగించడం జరుగుతుంది. ఇక డివైడర్లు లేనిచోట కొత్తవి నిర్మించి, ఉన్నచోట మొక్కలు నాటి నూతన అందాన్ని నెల్లూరుకు అదనంగా సమకూర్చనున్నాము.

● ఫైల్స్ తయారీలోనూ పారదర్శకత

ఇక పలు అంశాలకు సంబంధించి రూపుదిద్దే ఫైళ్లను మా కార్యాలయం ద్వారానే నడవాలన్నది కఠిన నిర్ణయంగా అమలులోకి తెచ్చాము. ప్రతి కాగితం ఆన్‌లైన్ ద్వారా నా ముందు కు వచ్చేలా ఆదేశాలిచ్చాను. దీని వల్ల నకిలీ, అవినీతికి తావుండదు. 99 శాతం ఫైళ్ల తయారీ వద్దే అక్రమాలు నిలిచిపోతాయి. మిగిలిన 1 శాతం ఆయా విభాగాధిపతి సదరు ఫైళ్లపై వివరణ ఇచ్చేటప్పుడు ఫుల్‌స్టాప్ పడుతుంది. ఇక ప్రజలు తమ సమస్యలను తెలుపుకునేందుకు స్వయం గా ఎస్ఎంసీకి రావాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా పంపే వెసులుబాటు కల్పించాము. ఇది పనివేళల్లో పూర్తి అందుబాటులో ఉంటుంది. ఇందుకు ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశాము. వచ్చిన ఫిర్యాదులపై నెల్లూరులోని సచివాలయ ఉద్యోగులను పూర్తిగా వాడుకుంటున్నాము.

● వర్షాల నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్

వర్షాలనైతే సమర్థవంతంగా ఎదుర్కొన్నాము. కానీ ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాము. డ్రైనేజీ కాలువల్లో పూడికను తొలగించడంతోపాటు ఖాళీ స్థలాల్లోని అపరిశుభ్రాన్ని ఇటు కార్పొరేషన్, అటు యజమానులతో కలిసి తీయిస్తున్నాము. రోడ్లపై నిర్మాణాల వ్యర్థాలను పూర్తిగా తొలగించడంతోపాటు దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రజలు కూడా తమ వంతు పాత్ర నిర్వర్తించాలి. వ్యర్థాలను రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్స్ లేదా ఇంటి ముందుకు వచ్చే మా వాహనాల్లో వేస్తే చాలు."

- నెల్లూరు సిటీ, (ఆంధ్రజ్యోతి)

ఎందుకంత నిర్లక్ష్యం?

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ నెల 10వ తేదీన ప్రభుత్వం జీవో ఇవ్వగా, ఆ మరుసటి రోజునే ఏఏ వర్కుకు ఎంత మేర కేటాయింపులు ఇచ్చారన్నది ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా జిల్లాలో ఎస్టిమేషన్లు రూపొందించి టెక్నికల్ అనుమతుల అనంతరం టెండర్లు పిలవాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నుంచి రావడమే ఆలస్యమనుకుంటే జిల్లాలో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చి రెండు వారాలు కావస్తోంది. కానీ ఇంత వరకూ ఎస్టిమేషన్లు కూడా పూర్తి కాలేదు. ఒక్క నెల్లూరు సబ్ డివిజన్ నుంచి మాత్రమే ఎస్టిమేషన్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు అందాయి. మిగిలిన డివిజన్ల నుంచి వస్తే గానీ సెంట్రల్ డివిజన్ నుంచి టెక్నికల్ అప్రూవల్ కోసం ఉన్నతాధికారులకు వెళ్లవు. ఇక టెక్నికల్ అప్రూవల్ వచ్చాక గానీ టెండర్లు పిలవడం సాధ్యం కాదు. కనీసం షార్ట్ టెండర్ ప్రక్రియ వారం రోజులైనా పడుతుంది. ఆ తర్వాత అగ్రిమెంట్, పని పూర్తి చేయడానికి మరో రెండు వారాలైనా పడుతుంది. ఈ లోపు సీజన్ మొదలవుతుంది. కాలువల్లోకి కూడా నీరు విడుదల చేయాల్సి వస్తుంది. అప్పుడు పనులు చేయడం కష్టమవుతుంది. ఇరిగేషన్ అధికారుల తీరుతో రైతాంగం ఆందోళన చెందుతోంది.

శుక్రవారం లోపు పంపుతాం

కాలువల అత్యవసర పనులకు సంబంధించి ఒక సబ్ డివిజన్ నుంచి ఎస్టిమేషన్లు అందాయి. మిగిలిన సబ్ డివిజన్ల నుంచి అందాల్సి ఉంది. వీటన్నిటినీ తెప్పించుకొని శుక్రవారంలోపు టెన్నికల్ శాంక్షన్ కోసం పంపుతాం. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి రైతులకు ఇబ్బందులు లేకుండా పూడిక తీత పనులు పూర్తి చేస్తాం.

- నాగరాజు, ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ

అక్రమాల గుట్టలు

(5వ పేజీ తరువాయి)

అధికారులు పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈకి మంగళవారం నివేదిక అందించారు. దీంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో వణుకు మొదలైంది. గత ప్రభుత్వంలో పాలకులు చెప్పిన విధంగానే తాము చేశామని, కాపాడాలంటూ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. హౌసింగ్‌లో భారీ అక్రమాలు, అవినీతి తమకు గండంగా మారతాయేమోనన్న తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

నిరక్షరాస్యుల కోసం 'ఉల్లాస్'

- మహిళల్లో అక్షరాస్యత పెంపే లక్ష్యం
- జిల్లాలో 19,178 మంది టార్గెట్
- ఐదు నెలల్లో లక్ష్యసాధనకు ప్రణాళిక

నెల్లూరు విద్య, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :2010లో నిర్వహించిన అక్షరాస్యత కుటుంబ సర్వే ప్రకారం 15 సంవత్సరాలు పైబడిన చదువురాని వారు జిల్లాలో 5,68,330 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు వీరికి 7 కోర్సులు నిర్వహించగా 4,18,373 మందిని అక్షరాస్యులుగా చేశామని, ఇంకా 1,53,458 మందిని చేయాల్సి ఉందన్నారు. అల్లూరు, అనంతసాగరం, చిల్లకూరు, కలువాయి, కొండాపురం, సైదాపురం ప్రాంతాల్లో పఢ్‌నా-లిఖ్‌నా కార్యక్రమం ద్వారా మరో 15,158 మందిని అక్షరాస్యులుగా తయారు చేశామని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అధికారులు మాత్రం 2021లో అక్షరచైతన్యం-1 పేరుతో ఉమ్మడి జిల్లాలోని 40 మండలాల్లో 1,33,438 మంది నిరక్షరాస్యులను గుర్తించి వారికి ఓపెన్‌స్కూల్ ద్వారా పరీక్షలు కూడా నిర్వహించామని, వీరిలో అత్యధిక మంది ఉత్తీర్ణత సాధించడంతో జిల్లా అక్షరాస్యత 16శాతం పెరిగిందని తెలిపారు.

● ప్రతిష్టాత్మకంగా ఉల్లాస్ నిర్వహణ

నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలల్లో పనిచేస్తున్న సహాయకులు, వంటపని చేసేవారు, కాపాలాదారులు, ఆయాలు, అంగన్‌వాడీ కేంద్రాల సహాయకుల్లో నిరక్షరాస్యులను గుర్తిస్తారు. ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ యాజమాన్యాలతోపాటు కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న వారినీ పరిగణలోకి తీసుకోనున్నారు. డీఆర్‌డీఏపరంగా గ్రామైక్య సంఘాల వివరాలను వీవోఏ, సీసీలు సేకరించునున్నారు. ఈ ప్రక్రియ అనంతరం ప్రతి పదిమందికి ఒక వలంటీరును (సంఘంలో విద్యావంతులైన వారు) ఎంపిక చేస్తారు. వీరందరికీ వయోజన విద్యాశాఖ ద్వారా పుస్తకాలు అందచేయడంతోపాటు టీసీఎస్ కంపెనీ సహకారంతో ఫంక్షనల్, డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన వీడియోలను ప్రదర్శిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ



అభ్యసన తరగతులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఏడుశాఖలను భాగస్వాములను చేయనున్నారు. వయోజన విద్య, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, డీపీఓ, సచివాలయం, డీపీఆర్‌ఓ, విద్యాశాఖ అధికారులతో జిల్లాస్థాయి కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. వీరితో పాటు జిల్లాకు ఒక నోడల్ అధికారి కూడా పనిచేయనున్నారు. రాష్ట్రస్థాయిలో ఈ నెల 25వతేదీ నుంచి నిర్వహించే శిక్షణా తరగతులకు వయోజనవిద్య, డీఆర్‌డీఏ నుంచి ఇద్దరేసి చొప్పున అధికారులు హాజరు కానున్నారు. అనంతరం ఎంపిడీఓ, ఏపీఎంలకు జిల్లాస్థాయిలో, సీసీ, వీవోఏ, వాలంటీర్లకు మండల స్థాయిలో శిక్షణ నిర్వహిస్తారు.

అక్షరాస్యత సాధించడమే లక్ష్యం

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా అక్షరాస్యత 69.90 శాతం ఉండేది. అయితే అక్షరచైతన్యం-1 కార్యక్రమం ముగిసిన తరువాత 84శాతం అక్షరాస్యతను సాధించాము. నెల్లూరు రూరల్‌లో 80.73శాతం అత్యధిక అక్షరాస్యత కలిగి ఉండగా తక్కువగా దక్కిలిలో 57.57 శాతం ఉంది. రాష్ట్రస్థాయిలో జిల్లా ఆరోస్థానంలో ఉంది. అన్ని ప్రాంతాల్లో అక్షరాస్యత పెంచే దిశగా విస్తృత కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నాము. వందశాతం పెంచేందుకు తాజాగా అక్షరచైతన్యం-2 కార్యక్రమం ప్రారంభించాము. జిల్లాలోని 37 మండలాల్లో 51,742 మందికి అక్షర తరగతులు నిర్వహిస్తున్నాము.

- ఎస్.మహమ్మద్ ఆజాద్, డిప్యూటీ డైరెక్టర్, వయోజన విద్య

సరికొత్త వెలుగులు



విద్యుత్ కోతలున్నా ఆ గ్రామాల్లో రాత్రిళ్లు నిరంతరాయంగా వీధిలైట్లు వెలుగుతుంటాయి. అందుకు కరెంటు బిల్లు కూడా కట్టాల్సిన అవసరం లేదు. ఇదేంటని ఆశ్చర్యపోతున్నారా... ? విషయానికొద్దాం.. ముత్తుకూరు మండలం పైనంపురంలో ఉన్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ థర్మల్ కేంద్రం వారు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పైనంపురం, నేలటూరు, నేలటూరుపాలెం, ముసునూరు వారిపాలెంతో పాటు టీపీగూడూరు మండలం వరకవి పూడి, మండపం గ్రామాల్లో సోలార్ వీధిలైట్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో సరికొత్త వెలుగులు సంతరించుకున్నాయి. అలాగే పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సోలార్ సిస్టం ద్వారా విద్యుత్ ను అందిస్తున్నారు. గతంలో విద్యుత్ కోతల తో ఇబ్బందిపడ్డామని, ఇప్పుడు సోలార్ విద్యుత్ ఎంతో ప్రయోజన కరంగా ఉందని ఆయా గ్రామాలవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి)

రైళ్లలో నిఘా ఉంచాలి

- నిర్లక్ష్యం వీడకుంటే చర్యలు తప్పవు
- రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రత నిమిత్తం రైళ్లల్లో నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలని, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి పటిష్ఠ నిఘా చర్యలు చేపట్టాలని గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. బుధవారం నెల్లూరు లోని రైల్వే సీఐ కార్యాలయంలో రైల్వే సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. స్టేషన్ల వారీగా రికార్డులను పరిశీలించారు. కేసులు పెండింగ్ ఉండటం, దొంగతనాలు, దోపిడీ కేసుల్లో దర్యాప్తు ముందుకు సాగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నిరక్ష్యం వీడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సివిల్, ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో రైళ్లల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ అనుమానా స్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించాలని సూచించారు. గంజాయి అక్రమరవాణాను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలన్నారు. అనంతరం నెల్లూరు రైల్వే పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో నెల్లూరు, ఒంగోలు రైల్వే సీఐలు భుజంగ రావు, షరీఫ్, సూళ్లూరుపేట, నెల్లూరు, ఒంగోలు, చీరాల ఎస్ఐలు చెన్నకేశవ రావు, మాలకొండయ్య అరుణకుమారి, కొండయ్య పాల్గొన్నారు.



నెల్లూరు రైల్వే పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న రైల్వే ఎస్పీ

వానరాలతో వణుకే!

వానరాలు అంటేనే సీతారామపురం వాసులు హడలిపోతున్నారు. ఏ వైపు నుంచి కోతుల మంద వచ్చి మీదపడుతుందోనని భయంతో వణికిపోతున్నారు. చేతిలో చిన్న పొట్లాలతో పిల్లలు, మహిళలు కనిపిస్తే వెంటపడి మరీ దాడులు చేస్తున్నాయి. ఇళ్లలోకి దూరి బీభత్సం సృష్టిస్తున్నాయని, ఎదురిస్తే దాడులు చేసి గాయపరుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇక బస్టాండ్ సెంటర్‌లోని షాపులపై ఎగబడి మరీ తినుబండారాలు, కూరగాయలు, పండ్లను ఎత్తుకుని వెళ్లిపోతుండటంతో వ్యాపారులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల మంద నుంచి తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)





రండి చూసుకుందాం.. ఇంటి వరండాలో కుర్చీపై వానరం

ప్రాసెసింగ్ ప్లాంట్ల సీజ్

- నిల్వ ధాన్యమే విత్తనాలుగా విక్రయం
- నిద్రావస్థలో అధికార యంత్రాంగం



ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్వాహకులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

అల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నకిలీ విత్తనాల విక్రయం జోరందుకుంది. ఇటీవల విజిలెన్స్ అధికారులు దాడులు చేసి విత్తనాల ప్రాసెసింగ్ ప్లాంట్లను సీజ్ చేశారు. నేరుగా విజిలెన్స్ ఎస్పీ రాజేంద్ర కుమార్ రంగంలో దిగి చర్యలు తీసుకున్నారు. అయినా ఏం పరవాలేదంటూ ప్లాన్ బీ అమలు చేస్తున్నారు. తమ వద్ద ఉన్న మరో మార్గాన్ని అక్రమార్కులు ఎంపిక చేసుకున్నారు. గత రబీ సీజనులో పండించి నిల్వ చేసుకున్న ధాన్యాన్నే నేడు విత్తనాలుగా విక్రయిస్తున్నారు. సాధారణంగా ప్రాసెసింగ్ ప్లాంట్ల ద్వారా విత్తనాల నాణ్యతా ప్రమాణాలను పాటించి తద్వారా బ్యాగుల్లో నింపి విక్రయించడం ఆనవాయితీ. ఇది కూడా అనుమతులు ఉన్న వారు మాత్రమే చేయాలి. కానీ ఇక్కడ భారీస్థాయిలో వందల పుట్లు ధాన్యాన్ని విత్తనాల రూపంలో రైతులకు విక్రయించేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 70 శాతం ధాన్యం అనగా 20 లక్షల కిలోల ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండానే విక్రయించేశారు. అల్లూరులో నాణ్యమైన వరివిత్తనాలు దొరుకుతాయనే రైతుల నమ్మకమే ఇక్కడి అక్రమ వ్యాపారులకు సిరులను కురిపిస్తోంది.

నిద్రావస్థలో అధికారులు

ఇంతజరుగుతున్నా అధికారులు మాత్రం నిద్రావస్థలో ఉన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోగా రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదులు కూడా ఇవ్వని పరిస్థితిలో విక్రయాలు భారీఎత్తున జరుగుతున్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఒకవేళ నష్టపోయిన రైతు కొనుగోలు చేసిన విత్తనాలకు తగిన ఆధారాలు లేకపోవడంతో ఎవవరిని అడగాలో కూడా దిక్కుతోచని పరిస్థితిలోకి వెళ్లిపోతాడు. అప్పుడు కూడా అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుంది. దీనిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పోలియోను పూర్తిగా తరిమేద్దాం

- ఒకప్పుడు పెద్ద సంఖ్యలో బాధితులు
- నేడు ఒక్కశాతమే!
- సత్ఫలితాలిస్తున్న 'పల్స్ పోలియో'
- ఏటా లక్షల మంది పిల్లలకు చుక్కల మందు
- నేడు ప్రపంచ పోలియో నివారణ దినం

ఒకప్పుడు పోలియా వ్యాధి అంటే భయపడిపోయేవారు. చిన్నారులకు పోలియో సోకితే జీవితాంతం వైకల్యమే!. దీని నివారణకు మందులు అందుబాటులో లేకపోవటంతో బాధితులు మానసికంగా కుంగిపోయేవారు. ఇలాంటి పరిస్థితిలో ప్రపంచ వ్యాప్తం గా జరిగిన ప్రయోగాల ఫలితంగా నేడు పోలియోను సమూలంగా నిర్మూలిం చే స్థాయికి వైద్య రంగం చేరుకుంది. తాజాగా కేవలం ఒక్క శాతం మాత్రమే పోలియో కేసులు నమోదు కావడం ఇందుకు నిదర్శనం.



నెల్లూరు వైద్యం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో 1960 - 80 దశకంలో పోలియో మహమ్మారి చిన్నారులపై త్రీవ ప్రభావం చూపింది. దీంతో వేలాది మంది వ్యాధి భారినపడి జీవచ్ఛవంలా బతికారు. ఈ నేప థ్యంలో 1968లో అమెరికాకు చెందిన శాస్త్రవేత్త జోనక్‌సాల్క్ చేసిన ప్రయోగాలు ఫలించి పోలియో నిర్మూలన టీకాను కనుగొన్నారు. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో 1995లో మన దేశంలో పోలియో వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. దీనికితోడు విస్తృత స్థాయిలో ఏడాదికి రెండు సార్లు పల్స్ పోలియో పేరుతో పోలియో చుక్కల మందును చిన్నారులకు వేయడంతో ప్రస్తుతం పోలియో రహిత జిల్లాగా గుర్తింపు లభించింది. ప్రభుత్వంతోపాటు వైద్య శాఖ, ఇతర శాఖల అధికారులు ప్రజల సహకారంతో ఒక ఉద్యమంలా ఈ వ్యాధి నిర్మూలనా కార్యక్రమాలు జరపడంతో ఈ విజయం నమోదైంది. ఈ వ్యాధిపై పూర్తిగా అవగాహన కలిగించే దిశగా రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా చేపట్టిన చర్యలు, టీకా కనుగొన్న జోనక్‌సాల్క్ పుట్టినరోజు సందర్భంగా ఏటా అక్టోబరు 24న ప్రపంచ పోలియో నివారణ దినంగా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించింది.

లక్షల మంది చిన్నారులకు

ప్రతి ఏటా జిల్లాలో 3.38 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్నారు. ఇప్పటివరకు 51 సార్లు పల్స్ పోలియో కార్యక్రమాలు జిల్లాలో చేపట్టి ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేశారు. మారు మూల గ్రామాల్లో సైతం శిబిరాలను ఏర్పాటు చేసి మందు పంపిణీ చేశారు. ఇందులో వైద్య ఆరోగ్య శాఖతోపాటు అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాలుపంచుకుంటున్నారు. పల్స్ పోలియో నిర్వహణకు ఏటా ప్రభుత్వం రూ.40లక్షలు జిల్లాకు కేటాయిస్తోంది. 2013లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తాలో ఓ పోలియో కేసు నమోదు కావడంతో దేశ వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ఇంకా కొనసాగుతోంది.

జిల్లాను పోలియో రహితంగా మారుస్తాం



జిల్లాను పోలియో రహతంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో ఎలాంటి పోలియో కేసులు లేవు. అయితే ప్రభుత్వం పోలియో నివారణ చర్యలు కొనసాగిస్తోంది. ప్రతిఏటా పోలియో చుక్కలు వేస్తున్నాం.

- డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌వో

అందుబాటులోకి ఆధునిక మందు

పోలియో వ్యాధి నివారణకు గతంలో ట్రైవాలెంట్ వ్యాక్సిన్ వాడేవారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బైవాలెంట్ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. గతంలో పీ1, పీ2, పీ3 వైరస్‌కు సంబంధించి ట్రైవాలెంట్ వ్యాక్సిన్ వాడేవారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాదిగా పీ2 వైరస్ నిర్మూలన కావడంతో కొత్త వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. దీంతోపాటు ఐపీవీ వ్యాక్సిన్ ఇంజక్షన్ కూడా అందుబాటులోకి రావడంతో చిన్నారులకు పోలియో చుక్కలతోపాటు ఈ ఇంజక్షన్‌ను ఇస్తున్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయిస్తే పోలియో వ్యాధి దరిచేరదని నిపుణులు సూచిస్తున్నారు.

సమస్యలు అధిగమించేందుకు క్షేత్రస్థాయి పర్యటన

- ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు

సంగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలోని 187 జూనియర్ కాలేజీల్లో సమారు 53 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, సమస్యలు అధిగమించేందుకు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐవో) డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన సంగంలోని 10 ప్లస్ స్కూల్‌ను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందాయా , లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అనంతసాగరం, నరసాపురం, గాంధీజనసంఘం పలుచోట్ల కోఎడ్యుకేషన్‌కు అనుమతి ఇవ్వడంతో విద్యార్థులు ఆశాజనకంగా చేరారన్నారు. ప్రైవేట్ కాలేజీల్లో గుర్తించిన సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు. అదే ప్రభుత్వ కాలేజీలయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

రబీ సీజన్‌కు ఎరువులు, విత్తనాలు సిద్ధం

- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

సంగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి పుష్కలంగా నీరు చేరడంతో రబీ సీజన్‌లో సుమారు 5.05 లక్షల ఎకరాలకు పైగా సాగవుతుందని అంచనా వేశామని, ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నా యని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నా రు. బుధవారం ఆమె మండలంలోని పడమటిపాళెం లో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం విస్తీర్ణంలో 4 లక్షల ఎకరాలలో వరి, లక్ష ఎకరాలలో ఇతర మెట్ట పంటలు సాగవుతుందని తెలిపారు. జిల్లాలో 38,500 మెట్రిక్ టన్నుల వరి విత్తనాలు అవసరమని గుర్తించామన్నారు. బీపీటీ, కెఎల్ఎం, ఆర్ఎన్ఆర్ రకాల విత్తనాలు 28 వేల మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయన్నారు. 14 వేల మెట్రిక్ టన్నుల విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. అలాగే పురుగుల మందులు మార్కెట్‌లో పుష్కలంగా ఉన్నాయన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏ సమస్య ఉన్నా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సూచనలు, సలహాలు అందచేసేందుకు వారంలో మంగళ, బుధ వారం రెండు రోజులపాటు నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయాధికారి శ్రీహరి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే సస్పెన్షన్

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్



మాట్లాడుతున్న డాక్టర్ గోవింద్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్ పిలుపునిచ్చారు. బుధవారం కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నెల్లూరు వైద్య కళాశాలలో మంచి వాతావరణం ఉందని, ఇలాంటి స్థితిలో ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులను సస్పెండ్ చేస్తామని హెచ్చరిం చారు. జీజీహెచ్ సూపరింటెండెం ట్ డాక్టర్ సిద్దానాయక్ మాట్లాడుతూ తాను వైద్య విద్యను అభ్యసించే సమయంలో ర్యాగింగ్ ఉండేదని, అది కేవలం జూనియర్లను పరిచయం చేసుకు నేలా ఉండేదన్నారు. అయితే చాలా కళాశాలలో ర్యాంగింగ్‌ను తరిమికొట్టారని చెప్పారు. విద్యార్థులు స్నేహితుల్లా, కుటుంబ సభ్యులుగా కలిసి ఉండాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్ జరగకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం న్యాయవాది రవి, సీఐ రోశయ్య మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే పడే శిక్షలను, చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాదేవి, డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ మునీర్‌ఖన్నా, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

- డ్వామా పీడీ గంగాభవాని



మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

ఆత్మకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలని డ్వామా పీడీ బి గంగాభవాని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో గురువారం నుంచి ఉపాధిహామీ పనులు ఎక్కువగా చేపట్టాలని, కూలీల వేతనం ఆధారంగా మెటీరియల్ కాంపోనెంట్ పనులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున క్షేత్రసహాయకులు ప్రతి పంచాయతీకి 100 నుంచి 150 మంది కూలీలతో పనులు చేయించాలని తెలిపారు. ఇప్పటివరకు ఆత్మకూరు నియోజకవర్గానికి రూ. 9 కోట్ల రూపాయలు సీసీ రోడ్లు, డ్రైనేజీలకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రైతులు ఉపాధిహామి పథకంలో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. ఈ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు మూడు సంవత్సరాల పాటు పూర్తి సబ్సిడీతో ఎకరాకు రూ.1,46,000 అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపీడీవో పి ఐజాక్ ప్రవీణ్, ఏపీడీ ఎం శంకరనారాయణ, ఏపీవోలు, ఈసీలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

కావలి రూరల్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మర్రి వెంకయ్యానాయుడు(75) మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం కావలి పెద్దపవని రోడ్డులోని సుచేతానగర్ సమీపంలో చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని వైకుంఠపురం లో నివాసం ఉంటున్న వెంకయ్యానాయుడు పొలంలో పనిచేయించేందుకు మోపెడ్‌పై సిరిపురం బయలు దేరాడు. అదే సమయంలో అగ్నిమాపకశాఖలో ఫైర్‌మన్‌గా పనిచేస్తున్న కే మధుబాబు మోటారు బైక్‌పై వచ్చి ఢీ కొన్నాడు. దీంతో కింద పడి తీవ్రగాయాలతో ఉన్న వెంకయ్య నాయుడును 108 వాహనంలో పట్టణంలోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. వెంకయ్య నాయుడు మృతితో వైకుంఠపురం, సిరిపురంలలో విషాదఛాయలు అలుము కున్నాయి. ఎస్ఐ గౌస్‌భాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7560
వెండి కిలో ధర	రూ. 101,900
వెండి ఒక గ్రాము	రూ.104.90

పది నిమిషాలలో వస్తాననీ..

రైలు ఢీకొని కావలివాసి మృతి?



మాల్యాద్రి (ఫైల్)

కావలి రూరల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై పొన్నగంటి మాల్యాద్రి(55) మృతదేహాన్ని బుధవారం జీఆర్పీ పోలీసులు గుర్తించారు. వారి కథనం మేరకు, పట్టణంలోని నార్తు జనతాపేటలో ఉంటున్న మాల్యాద్రి న్యూబాలాజీ మెడికల్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి 9.30 గంటలకు మెడికల్ ఏజెన్సీ వారు వస్తున్నారని, వారితో మాట్లాడి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ రాకపోవటంతో ఆయన కుమార్తె మౌనిక అర్ధరాత్రి ఫోన్ చేయగా, రైల్వేస్టేషన్ దగ్గర ఉన్నానని 10 నిమిషాల్లో వస్తానని చెప్పాడు. ఈ క్రమంలో స్టేషన్ సమీపంలో దిగువ మార్గంలోని రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని ట్రాక్‌మన్ మహేష్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ ఎం. వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని రైలు ఢీకొని ఉండవచ్చని, లేక మరే కారణం వల్లనో చనిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య నిరూప, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

కావలి రూరల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్లదిన్నె క్రాస్ రోడ్డు ఎదురుగా జాతీయ రహదారికి, రైల్వే ట్రాక్‌కు మధ్య పొలాల్లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైతులు గుర్తించారు. అనంతరం వీఆర్వో సింగరయ్యకు సమాచారం ఇచ్చారు. వీఆర్వో ఫిర్యాదుతో రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు గల మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. నలుపు రంగు చొక్కా, నాచు కలర్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. 3 నుంచి 4 రోజుల క్రితం మృతి చెంది ఉండటం తో మృతదేహం ఉబ్బిపోయి ఉన్నట్లు పోలీసులు తెలిపారు, రూరల్ సీఐ రాజేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పించండి

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్ల వినియోగంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. కోటమిట్టలోని విద్యుత్ రెవె న్యూ అధికారులతో ఆయన బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు స్మార్ట్ మీటర్లదేనని, మీటర్ల వినియోగానికి వినియోగదారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే ప్రయోజనాలను కస్టమర్లకు వివరించాలని, సోలార్ విద్యుత్ ఏర్పాటుపై చైతన్యపరచాలని సూచించారు. బిల్లుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి, నగర ఈఈ శ్రీధర్, డీఈఈలు అశోక్, సునీల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024-25 సంవత్సరానికి సంబంధించి భర్తీ కాని సీట్లలో ప్రవేశాలకు ఐదో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జీజీఐఐజౌరి.జీ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26వతేదీలోపు దరఖాస్తును రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అనంతరం అభ్యర్థులకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారని తెలిపారు. ఆ దరఖాస్తును ప్రింట్ తీసుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 27న తాను చేరదలచుకున్న ఐటీఐ కళాశాలలో హాజరై సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలలో చేరేందుకు 28వతేదీన, ప్రైవేట్ ఐటీఐలలో చేరేందుకు 30వతేదీన కౌన్సెలింగ్ జరుగుతుందని, అభ్యర్థులకు సందేహాలుంటే సమీపం లోని ఐటీఐ కళాశాలల్లో సంప్రదించాలని కోరారు.

సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడలకు 29 నుంచి జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయిలో 2024-25 సంవత్సరానికి జరిగే సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్ల ఎంపిక ఈనెల 29 నుంచి నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 29న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలకు ఎంపికలు జరుగుతాయన్నారు. అదేరోజు దర్గామిట్టలోని నెల్లూరు క్లబ్‌లో లాన్ టెన్నిస్ జట్ల ఎంపికలుంటాయన్నారు. 30వతేదీన స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, మ్యూజిక్, డ్యాన్స్, పార్ట్‌ప్లే పోటీలను స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన సివిల్ సర్వీస్ ఉద్యోగులు, ప్రస్తుతం పనిచేస్తున్న కార్యాలయాధికారి నుంచి తమ పేరు, హోదా తెలిపే లేఖతో సంబంధిత తేదీల్లో హాజరు కావాలని కోరారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ఉద్యోగులు గుంటూరులో నవంబరు 6 నుంచి 9వతేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు డీఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

డిగ్రీ పరీక్షలకు 206 మంది గైర్హాజరు

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 206 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారిని ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు.

ఎల్లలు దాటుతున్న తెల్లరాయి

- ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

వలేటివారిపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేని చెరువు ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే అటవీ, ప్రభుత్వ భూముల్లో సైతం తెల్లరాయి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో తెల్లరాయి సరిహద్దులు దాటుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న తెల్లరాయి

● ప్రభుత్వ ఆదాయానికి గండి

కొన్నేళ్లుగా పోలినేనిచెరువు, చుండి, వలేటివారిపాలెం, మాలకొండ, తదితర గ్రామాల్లోని రెవెన్యూ అటవీ భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న తెల్లరాయి వ్యాపారంతో ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోంది. ఒక్కో తెల్లరాయి లారీ లక్షన్నర నుండి రెండు లక్షల వరకూ ధర ఉంటుంది. కొల్లగొట్టిన తెల్లరాయిని లారీలు, టిప్పర్లలో రాత్రిళ్లు ఎల్లలు దాటిస్తున్నారు. అంతేగాకుండా తెల్లరాయి పెద్దపెద్ద గుండ్లను ఎక్స్‌కవేటర్లతో పెకిలించి టిప్పర్ల ద్వారా రహస్య ప్రదేశానికి తరలించి రాయిని చిన్న సైజులుగా చేసి అక్కడ నుంచి రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు.

● అనుమతులు నిల్

ఎక్కడైనా తెల్లరాయి తవ్వకాలు జరపాలంటే రెవెన్యూ శాఖ అనుమతులు పొందాలి. అలాగే కూలీలకు లేబర్‌చట్టం కింద కనీస వేతనం చెల్లించడంతోపాటు 8 గంటలు మాత్రమే పనిచేయించాలి. పనిచేసే ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలి. సేకరించిన తెల్లరాయిని తరలించాలన్నా అనుమతి తప్పనిసరి. ఇలాంటివేమీ లేకుండా అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లోని తెల్లరాయిని యథేచ్ఛగా తరలిస్తున్నారు.

● దాడులు శూన్యం

తెల్లరాయి తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నా అధికారుల దాడులు మాత్రం శూన్యం. అక్రమ తెల్లరాయి తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం అధికారులకు తెలిసినప్పటికీ కనీసం అటు వైపు కన్నెత్తి కూడా చూడడంలేదని, తవ్వకాల వల్ల భూములు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తెల్లరాయి తవ్వకాలపై నిఘా పెట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా ప్రతిష్ఠోత్సవాలు



గ్రామోత్సవంలో స్వామివారు

కలిగిరి (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 23: పట్టణంలోని కొత్తూరు ప్రాంతంలో గల శ్రీకోదండరామస్వామి ఆలయంలో హనుమత్ సమేత సీతా,రామ,లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామివారి విగ్రహాలు గ్రామోత్సవానికి రాగా భక్తులు కాయ కర్పూరం సమర్పించారు. గురువారం స్వామివారం శిలాబింబాలకు పాలభిషేకం, క్షీరాదివాసం, ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణ వద్ద భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశామన్నారు. చిన్నారులు ప్రదర్శించిన కోలాటం భక్తులను ఎంతో అలరించింది.

ప్రసన్నుడి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

బిట్రగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్లపల్లి గ్రూపు టెంపుల్స్ ఈవో సీహెచ్ యానాదయ్య పర్యవేక్షణా. దికారిగా వ్యవహరించారు. 113 రోజులకు భక్తులు ఇచ్చిన కానుకలు రూ. 16, 44, 440 వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి మాజీ సభ్యులు తులసీరామ్, కావలి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది, భక్తులు తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లైంట్ పచ్చవ కార్తికేయ, తండ్రి పేరు పచ్చవ వినోద్ మైనర్ అయినందున అతని తరఫున అతని తల్లి మరియు గార్డియన్ అయిన పచ్చవ ప్రవీణ భర్త పేరు పచ్చవ వినోద్, నందిపాడు గ్రామం, దుత్తలూరు మండలం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లైంట్ తండ్రిగారైన పచ్చవ వినోద్ తండ్రి పేరు లేటు పచ్చవ నాగేశ్వరరావు నివాసము నందిపాడు గ్రామం, దుత్తలూరు మండలం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వారికి వారసత్వ రీత్యా సంక్రమించిన దిగువ షెడ్యూల్ ఆస్తులను అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నం చేయుచున్నారు. మా క్లైంట్ కూడా దిగువ షెడ్యూల్ ఆస్తులకు వారి తండ్రి తో పాటు సమాన హక్కులు కలిగి ఉన్నారు. మా క్లైంట్ తండ్రిగారు మా క్లైంట్ కు దిగువ షెడ్యూల్ ఆస్తులలో భాగము మా క్లైంట్ కు చెందకుండా అతని వాటా భాగమును కూడా విక్రయించుటకు ప్రయత్నం చేయుచున్నారని తెలిసినది. వారి చర్యలు చట్ట విరుద్ధము మరియు సదరు దస్తావేజులు చెల్ల నేరవు. అందుచేత మా క్లైంట్ వారి తండ్రి గారికి ది.21-10-2024 న లాయర్ గారి ద్వారా నోటీసు జారీ చేసినారు. కనుక దిగువ షెడ్యూల్ ఆస్తులను పచ్చవ వినోద్ వద్ద నుండి కొనుగోలు చేయు ప్రయత్నములు విరమించుకోవలసిందిగా మా క్లైంట్ కోరుచున్నారు. ఎవరైనా అతిక్రమించిన యెడల వారి చర్యలు మా క్లైంట్ యొక్క హక్కులను హరించలేవు. కావున బహిరంగంగా తెలియజేయడమైనది.

షెడ్యూల్ : ఐటెం నెం.1: పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, దుత్తలూరు మండలం, నందిపాడు గ్రామం మరియు పంచాయతీ లో చేరి ఉన్న R.S. No. 164-2-G లోని య.2.50 సెంట్లు మరియు R.S. No. 164-2-F లోని య.2.50 సెంట్లు మొత్తం య.5-0 సెంట్లు వ్యవసాయ భూమి.

ఐటెం నెం.2: పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, దుత్తలూరు మండలం, నందిపాడు గ్రామం మరియు పంచాయతీ లో చేరి ఉన్న R.S.No. 181-2 లోని య.4.61 సెంట్లు మరియు R.S.231 లోని య.1-05 సెంట్లు వ్యవసాయ భూమి.

ఎం. ఆదినారాయణ రావ్, న్యాయవాది
షాప్ నెం.6, అమ్మనాఎన్క్లేవ్స్, మ్యూజియం రోడ్,
గవర్నర్ పేట విజయవాడ-520002.
N.T.R జిల్లా, మొబైల్ నెం.9848448131.
విజయవాడ,
తేదీ 21-10-2024

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

సంగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజన సంఘంలో ఇటీవల బొలెరా వాహనం చోరీ కేసులో నిందితుడ్ని బుధవారం సంగం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల మేరకు... గ్రామానికి చెందిన జి వెంటేశ్వర్లు నాలుగు రోజుల కిందట తన బొలెరా వాహనాన్ని ఇంటి ముందు నిలిపి నిద్రించాడు. నిద్రలేచి చూడగా వాహనం లేదు. చుట్టూ విచారించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో వాహనాన్ని బాధితుడికి సోదరుడైన మల్లికార్జున తీసుకెళ్లినట్లు తెలియడంతో నిందితుడ్ని అదుపులోకి తీసుకుని పిడుగురాళ్లలో ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితుడ్ని కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

రాళ్లపాడు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి

● ఎమ్మెల్యే ఇంటూరికి నియోజకవర్గ అభివృద్ధి మండలి వినతి



ఎమ్మెల్యే ఇంటూరితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, తదితరులు

కందుకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 100కి పైగా గ్రామాలకు తాగునీటికి ఆధారంగా మారిన రాళ్లపాడు రిజర్వాయరులో చేపల పెంపకం వలన జలాలు కలుషితమవుతున్నందున తగినచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం నేతృత్వంలో స్థానిక కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యేని కలిసి ప్రతినిధులు రాళ్లపాడు రిజర్వాయరు జలాల ల్యాబ్ రిపోర్టును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ రాళ్లపాడు రిజర్వాయరులో సహజసిద్ధంగా పెరిగిన చేపలను మాత్రమే పట్టుకోవాలి తప్ప దానిని చేపల చెరువుగా మార్చి పిల్లలు వేసి వాటికి మేతలు, కోళ్లవ్యర్థాలు వేస్తున్నందున జలాలు కలుషితమవుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జలాలు కలుషితం కావటానికి కారణం అక్కడ శుద్ధిచేసే పరికరాలు మార్చి 8 సంవత్సరాలు అయినందున సమస్య వచ్చిందని, ఇటీవలే వాటిని మార్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధిమండలి ప్రతినిధులు పాలేటి కోటేశ్వరరావు, కాకుమాని మాధవరావు, నేతి మహేశ్వరరావు, తోకల వెంకటేశ్వర్లు, నరేష్ పాల్గొన్నారు.

అనకట్ట ఆక్రమణలు అరికట్టాలి

● లింగసముద్రం: పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం సమీపంలోని పొలాల్లో ఉన్న చిన్న ఆనకట్ట (సాగు నీటి కుంట)కు చెందిన భూముల ఆక్రమణలను అరికట్టాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుకు టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. బుధ వారం పంచాయతీలోని జంపాల వారిపాలెం టీ డీపీ నాయకులు జంపాల కృష్ణయ్య, చింతల వెంకటేశ్వర్లు, కోనూరు రమణయ్య మరి కొందరు కందుకూరులో ఎమ్మెల్యేను కలిసి ఆక్రమణలు తొలగించాలని వినతి పత్రం ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి వెంటనే తహసీల్దారు శ్రీనివాసులకు ఫోన్‌చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వారు తహసీల్దారును కలిసి వినతిపత్రం అందజేయగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

సోమశిల ఉత్తర కాలువ నుండి కలిగిరి మండలం జిర్రావారిపాలెం వద్ద నీటి ప్రవాహం రాళ్లపాడు ప్రాజెక్టుకు సక్రమంగా రాకపోవడంతో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తన స్వంత నిధులు రూ.5 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. గురువారం సాయంత్రం కల్లా పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అధ్యాపకులను నియమించాలి

● గుడ్లూరు : జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అధ్యాపకులను నియమించాలని ఎమ్మెల్యేను విద్యార్థులు కోరారు. బుధవారం కందుకూరు నుంచి గుడ్లూరు మీదగా ఎమ్మెల్యే నెల్లూరుకు వెళ్తున్నట్లు సమాచారం అందుకున్న కొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులు గుడ్లూరు హైస్కూల్ రోడ్డు వద్ద ఎమ్మెల్యేను ఆపి తమ సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే డీఈవోకి ఫోన్ చేసి అధ్యాపకుల నియామకాలకు రంగం సిద్ధం చేయాలని సూచించారు. అధ్యాపకులను నియమించేలా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

జలదంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరప్పాడు బస్టాండు సమీపంలో బుధవారం ఆటో ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన దావులూరి మాలకొండయ్య(65) మృతిచెందాడు. మాలకొండయ్య ఇంటి వద్ద నుంచి పని మీద రోడ్డుపై నడిచి వెళుతుండగా ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను నెల్లూరుకి తరలించ గా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ లతీఫున్నీసా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ బలోపేతానికే సభ్యత్వ నమోదు : కాకర్ల



వింజమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం వింజమూరు మండలం బొమ్మరాజు చెరువు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సభ్యత్వ నమోదు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 26వతేదీ నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు మహర్దశ

- రూ.1,81 కోట్ల జైకా నిధులతో అభివృద్ధి

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లోని చెరువులను జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) రూ.1.81 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. వాస్తవానికి ఈ నిధులు గత వైసీపీ ప్రభుత్వంలోనే (2021) మంజూరవగా, నిధులు దారి మళ్లించడంతో చెరువులు అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా చెరువులను అభివృద్ధి చేసేందుకు నడుం బిగించింది. పనులు పూర్తయితే వందల ఎకరాల ఆయకట్టు భూమి అభివృద్ధికి రానుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఉదయగిరి సబ్ డివిజన్‌లోని ఉదయగిరి చిన్న, పెద్ద చెరువులను రూ.48 లక్షలు, గువ్వాడి రూ.23, ఇస్కపల్లి రూ.27, కృష్ణం పల్లి రూ.32 లక్షలు, లింగంనేనిపల్లి రూ.51 లక్షల చొప్పున మరమ్మతులు చేపట్టనున్నారు. ఇప్పటికే కొన్ని చెరువుల్లో పనులు మొదలయ్యాయి. పనులు పూర్తయితే పూర్తి ఆయకట్టు సాగులోకి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి మాట్లాడుతూ చెరువుల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

'లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించం'

కందుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తన పాలనలో రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై విచ్చలవిడిగా అఘాయిత్యాలు జరిగితే కనీసం నోరు విప్పని పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి ఇవ్వాళ రాష్ట్రంలో మహిళ లకు కనీస భద్రత లేదని అసత్య ఆరోపణలు చేస్తుండటం హేయమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ విమర్శించారు. రాష్ట్రమంత్రి లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని ఆయన హెచ్చరించారు.

జీవాలకు టీకాలు వేయించాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో బుధవారం నట్టల నివారణ కార్యక్రమం చేపట్టినట్లు పశు వైద్యాధికారి అనూష తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 1500 జీవాలకు ఈ మందు తాపించినట్లు ఆమె తెలి పారు. వర్షాలు కురుస్తున్నందున జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయిం చుకోవాలని ఆమె యజ మానులుకు సూచించారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

మర్రిపాడు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 23 : అభివృద్ధి పేరుతో కేతిగుంట పంచాయతీలో సర్పంచ్ హరితేజ నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్థుల ఫిర్యాదుతో డీఎల్‌పీవో నారాయణ బుధవారం విచారణ చేపట్టారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేసి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. పల్లిపాడులోని ఎస్సీ కాలనీలో ఓ పంపు సెట్ మరమ్మతులకు ఏకంగా రూ. 98400 ఖర్చు చేసినట్లు ఎంబుక్‌లో రికార్డుచేసి నగదు డ్రాచేశారు. ఇలా రికార్డు అస్తవ్యస్తంగా ఉన్నట్లు డిఎల్‌పీవో గుర్తించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పనులు జరిగినట్లు రికార్డుల్లో ఉన్న ప్రాంతాలను పరిశీలించి నివేదికను తయారుచేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని డీఎల్‌పీవో తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఈవోపీఆర్డి రమేష్ ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాల నివారణే లక్ష్యం : డీఎస్పీ

ఆత్మకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాల నివారణే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ కె వేణుగోపాల్ తెలిపారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని టిడ్కో గృహాల సముదాయంలో బుధవారం తెల్లవారుజాము నుంచి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని ఇద్దరు సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పెద్దఎత్తున మోహరించి ప్రతి ఇంటిని తనిఖీ చేసి వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేని 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం దుకాణం తొలగించాలి

ఏఎస్ పేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హసనపురం గ్రామంలో ఇటీవల నూతనంగా ఏర్పాటుచేసిన మద్యం షాపును అక్కడనుంచి తొలగించాలని బుధవారం హసనపురం గ్రామా నికి చెందిన ముస్లింలు తహసీల్దారు శ్రీరామకృష్ణకు వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొండ పోరంబోకు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన గదిలో మద్యం దుకాణం ఏర్పాటుచేశారని, ఆ దుకాణం దర్గా, గుడికి సమీపంలో ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆ షాపును అక్కడినుంచి తొలగించి వేరే ప్రదేశానికి మార్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దారుకు వినతిపత్రం అందచేశారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తాం

● సీహెచ్ మణికుమార్ పంచాయతీరాజ్ డీఈ



ఉదయగిరి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో నియోజకవర్గంలో చేపడుతున్న సిమెంట్‌రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించడంతోపాటు త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పేర్కొన్నారు.

నియోజకవర్గంలో ఎన్ని రోడ్లు, ఎంత నిధులతో వేస్తున్నారు?

!: నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 333 సిమెంట్‌రోడ్లను రూ.19. 26 కోట్లతో నిర్మిస్తున్నాం.

ఏఏ మండలాల్లో ఎన్ని రోడ్లు, ఎంత నిధులు కేటాయించారు?

!: నియోజకవర్గంలోని దుత్తలూరు మండలంలో 57 రోడ్లకు రూ.2.65 కోట్లు, జలదంకిలో 36 రోడ్లకు రూ.2.37 కోట్లు, కలిగిరిలో 25 రోడ్లకు రూ.2. 36 కోట్లు, కొండాపురంలో 40 రోడ్లకు 2.40 కోట్లు, సీతారామపురంలో 51 రోడ్లకు రూ. 2.38 కోట్లు, వరికుంటపాడులో 44 రోడ్లకు రూ. 2.36 కోట్లు, ఉదయగిరిలో 41 రోడ్లకు రూ.2.36 కోట్ల నిధులు కేటాయించాం.

నిర్మాణ పనులు ప్రారంభించారా?

!: నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఇప్పటికే పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులకు తగు సూచనలు అందజేశాం.

28న ప్రజావేదిక

అనంతసాగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) 23: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఈనెల 28న జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారని జిల్లా కలెక్టర్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని మండల అధికారులకు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించేలా ఈ కార్యక్రమం ఉంటుందని, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని, ఈవిషయం ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని ఆదేశించారు.

ఏర్పాట్ల పరిశీలన

అనంతసాగరం తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రజావేదిక కార్యక్రమం కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆత్మకూరు ఆర్డీవో పావని బుధవారం పరిశీలించారు. ఈమేరకు మండల అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మెట్టుకూరు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

అపార్ రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ శుక్రవారం పూర్తిచేయాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 1-10వ తరగతి చదివే విద్యార్థులకు అపార్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్ ఎంటీలు పాల్గొన్నారు.

వర్గీకరణ, క్రిమీలేయర్ వద్దు

కందుకూరు, అక్టోబరు 23: ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్ వద్దని కోరుతూ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం సబ్ కలెక్టరు శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. మాలమహానాడు రాష్ట్ర జేఏసీ గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు సబ్ కలెక్టరును కలిసి రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఈ వినతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొటగుంట శ్రీనివాసులు, గుంటక మల్లికార్జున, చనమాల వాసు, గంటెనపల్లి ప్రసాదు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

లింగసముద్రం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన భూముల రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేసుకునేందుకు రైతులు రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని విశ్వనాధపురంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామసభల ద్వారా భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 16 మంది రైతులు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు బొల్లినేని నాగేశ్వరరావు, వీఆర్వోలు కిషోర్, బ్రహ్మయ్య, సర్వేయరు శివసాయి, బాలాజీ, వినోద్ రైతులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

లింగసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో శనగ పైరు సాగుచేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసిన తర్వాత విత్తనాలను విత్తుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి అబ్రహాంలింకన్ చెప్పారు. బుధవారం మండలంలోని వీఆర్ కోట, మాలకొండరాయునిపాలెం గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విత్తనశుద్ధితో తెగుళ్లు, పురుగుల బెడద తప్పుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు జె ప్రవీణ్, డ్రిప్ ఇరిగేషన్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాలువల కబ్జాలు తొలగేనా ?

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనిగిరి రిజర్వాయర్ సదరన్ చానల్‌లో నుంచి వచ్చే పాత గుడపల్లి కాలువ జాతీయ రహదారికి దక్షిణం నుంచి జెండాదిబ్బ, శాంతినగర్, ఖాజానగర్‌ల మీదుగా రేబాలకు వెళ్లే కాలువలో కలుస్తుంది. కొత్త గుడపల్లి కాలువ జాతీయ రహదారికి ఉత్తరంవైపు నుంచి హరివిల్లు లేఔట్, సుబ్బారెడ్డినగర్ నుంచి కూరగాయల మార్కెట్ మీదుగా శేషాద్రినగర్ వద్ద రేబాలకు వెళ్లే కాలువలో కలుస్తుంది. అయితే గత 15ఏళ్ల క్రితం ఈ కాలువల కబ్జాల తొలగింపునకు ఇరిగేషన్ అధికారులు సర్వే చేశారు. తీరా కబ్జాల తొలగింపు మొదలయ్యేసరికి అప్పటి ప్రజాప్రతినిధులు కాలువల విస్తరణను అటకెక్కించారు. చివరకు ఆ పంటకాలువలన్నీ మురుగు కాలువలుగా మారాయి. దీనికితోడు ఆక్రమణలతో 60 నుంచి 120 అడుగులున్న పాత, కొత్త గుడపల్లి కాలువలు, 6నుంచి 12 అడుగులకు కుంచించుకుపోయాయి. దీంతో భవిష్యత్తులో వరదలొస్తే ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కోకతప్పదు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి వెంటనే కాలువలను సర్వే చేయించి, ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఎంతైనావుంది.



కొత్త గుడపల్లి కాలువ వెంబడి నిర్మిస్తున్న భవనాలు

మద్యం దుకాణాన్ని తొలగించాలి

● శ్రీనివాస నగర్, జగదీష్ నగర్‌లో మహిళల ఆందోళన



శ్రీనివాస నగర్‌లో ఆందోళన చేస్తున్న మహిళలు,హైవేపై మద్యం షాపు వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

నెల్లూరు (వైద్యం/క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 5వ డివిజన్ శ్రీనివాస నగర్‌లో మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆరు రోజులుగా ఆందోళన చేస్తున్న శ్రీనివాసనగర్ వాసులకు మద్దతుగా బుధవారం ఆమె నిరసన వ్యక్తం చేశారు. మద్యం దుకాణాలను జనవాసాల మధ్య ఏర్పాటు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి పద్మ, అధ్యక్షురాలు సుబ్బమ్మ, సీపీఎం నాయకులు రాంబాబు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

● జాతీయ రహదారిపై..

నగరంలోని చింతారెడ్డిపాలెం జాతీయ రహదారి పక్కనే 16వ డివిజన్ జగదీష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వైన్‌షాపును తొలగించాలని స్థానికులు మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. బుధవారం మహిళలు, చిన్నారులు ఆందోళన కొనసాగించారు. మద్యం దుకాణం తెరవక ముందే షాపు ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. దుకాణం యాజమాన్యం నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో రోజంతా వైన్‌షాపును మూసివేశారు. వైసీపీ నాయకులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నిరసనకు మద్దతు తెలిపారు. వెంటనే వైన్‌షాపును అక్కడి నుంచి తొలగించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

న్యూస్ బాక్స్

రేపటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

మనుబోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపేటలో శుక్రవారం నుంచి గ్రామదేవత మొలకల వేమాలమ్మ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు ఏకొల్లు కోదండరామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామదేవతతో పాటు అంకమ్మ, పోతురాజుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. మూడురోజుల పాటు ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని, ఆదివారం విగ్రహ ప్రతిష్ఠఅన్నదానం, పల్లకీసేవలు ఉంటాయని వారు తెలిపారు.

పనులు సకాలంలో పూర్తిచేయాలి

రాపూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీవో భవానీ అధికారులకు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎంపీపీ కుమ్మరగుంట ప్రసన్న, జడ్పీ వైస్ ఛైర్మన్ చిగురుపాటి ప్రసన్న ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పి లక్ష్మీనరసింహం, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ, మండల అధికారులు పాల్గొన్నారు.

మల్లూరులో పశువైద్య శిబిరం

ముత్తుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎదకు రాని పశువులకు సకాలంలో వైద్యం చేయించడం ద్వారా పశు సంపద అభివృద్ధి సాధ్యమని పశుసంవర్ధక శాఖ డీడీ నాగమణి తెలిపారు. మల్లూరులో బుధవారం పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో రాష్ట్రీయ గోకుల్‌మిషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఎదకురాని 26 పశువులకు చికిత్స చేశారు. దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్‌డీఏ కార్య నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ముత్తుకూరు ఏడీ డాక్టర్ నిర్మల, పశువైద్యులు వసంతరాయులు, రాజ్యలక్ష్మి, శంకరరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శివతేజరెడ్డి పాల్గొన్నారు.

రీసర్వేలో అవకతవకలు

మనుబోలు, అక్టోబరు 23(ఆంధ్ర జ్యోతి): మండలంలోని బండేపల్లి, చెరుకుమూడి గ్రామాల్లో జరిగిన రీసర్వేల్లో పలు అవకతవకలు జరిగనట్లు ప్రాథమిక విచారణలో తేలిందని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. బుధవారం ఆర్డీవో నాగసంతోష అనూషతో కలిసి ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. చెరుకుమూడి, బండేపల్లి రెవెన్యూ గ్రామాల రీసర్వే ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు, ఆధారాలు లేకుండానే రీసర్వేలో అసైన్‌మెంట్ భూములను ఇతరుల పేర్లు మార్చినట్లు, ఇందులో రెవెన్యూ సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు గుర్తించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో మండలం నుంచి ఎక్కువగా రీసర్వేలో అవకతవకలు జరిగాయంటూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో విచారణ చేయాలని వచ్చామన్నారు. విచారణ పూర్తయితే బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య, డీటీలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

13న పేరెంట్స్ సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): నవంబరు 13న ప్రతి పాఠశాలలో టీచర్స్, పేరెంట్స్ అసోసియేషన్‌సమావేశం నిర్వహించాలని ఎంఈవో తెలిపారు. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, ఎంఈవోలతో బుధవారం విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారని తెలిపారు.

కార్యదర్శులతో సమీక్ష


బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు23,(ఆంధ్రజ్యోతి): బుచ్చి మండలం కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో శ్రీహరి సమీక్ష నిర్వహించారు. తాగునీరు, పారిశుధ్యం, మురుగుకాలువలు పూడికతీత, తదితర అంశాలపై వారితో చర్చించారు.మండలంలో ఏ గ్రామంలోనైనా ఉపాధి హామీ పనుల్లో కూలీలతో పనులు చేయించకుండా చేసినట్టు దొంగ మస్టర్లు వేసే చర్యలు తప్పవని క్షేత్ర సహాయకులను ఎంపీడీవో హెచ్చరించారు.

'జెండాదిమ్మె వేస్తే ఎందుకు టెన్షన్'

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 13వ డివిజన్‌లో టీడీపీ జెండాదిమ్మె వేస్తే ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి ఎందుకు టెన్షన్‌గా ఉందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ప్రశ్నించారు. మీరు పార్టీ జెండా ఎగువ వేస్తే పార్టీ కార్యక్రమం, మేము ఎగురవేస్తే ఆక్రమణనా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బాలాజీనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ఆక్రమణలకు పాల్పడుతోందంటూ ఎమ్మెల్సీ గ్రీవెన్స్‌లో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంపై మండిపడ్డారు. 13వ డివిజన్‌లో పంట కాలువలు పూడ్చేసి ఆక్రమించిన పార్టీ మీది కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తానే మస్తాన్, అంచూరు శ్రీనివాసులు నాయుడు, కాయల తిరుపతి, శ్రీకృష్ణ, శీలం మల్లి, మోహన్, పావురాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిక్కచ్చిగా భూసర్వే

● కోవూరు తహసీల్దారు నిర్మలానందబాబ



కోవూరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రామాల్లో రీసర్వేలో లోపాల్ని సరిదిద్ది నిక్కచ్చిగా భూసర్వే రికార్డుల్ని పొందుపరచనున్నట్టు తహసీల్దారు నిర్మలానందబాబ తెలిపారు. గ్రామాల్లో సమగ్ర భూసర్వే లోపాల్ని పారదర్శకంగా పరిష్కరిస్తున్నామని ఆయన తెలిపారు.

ఈ వారం ముఖాముఖి

? ఇప్పటికి ఎన్ని గ్రామాల్లో రీసర్వేపై గ్రామసభలు పెట్టారు.

! గంగవరం, పాటూరు గ్రామాల్లో సభలు పెట్టాం. పాటూరులో 39మంది రైతులు రీసర్వేలో లోపాలున్నాయని ఫిర్యాదు చేశారు.

? ఎలాంటి సమస్యలు మీ దృష్టికి వస్తున్నాయి.

! కొనుగోలు డాక్యుమెంట్లలోని భూవివరాలకు సర్వేలోని భూ వివరాలకు కొన్ని చోట్ల తేడాలు కన్పిస్తున్నాయి. ఎప్పుడో కొనుగోలు చేసిన భూవివరాలకు రీసర్వేలోని వివరాలకు పొంతన కుదరడంలేదని పలువురు ఫిర్యాదు చేశారు. వారసత్వం, రిజిస్ట్రేషన్‌లో వచ్చిన భూమి ఆధారంగా సర్వే రికార్డుల్ని నమోదు చేస్తున్నాం,

? ఇనాం భూసమస్యల్ని ఎలా పరిష్కరిస్తారు.

! ఇనాం భూమిని పొందిన రైతులు రీసర్వేలో తమ పేర్లను నమోదు చేయమని విన్నవించుకుంటున్నారు. జేసీ దృష్టికి తీసుకెళ్లి రీసర్వేలో వారి పేర్లను నమోదుచేస్తాం.

? రీసర్వే లోపాల్ని నిక్కచ్చిగా ఎలా చేయగలుగుతున్నారు.

! రోవర్ సర్వే వల్ల కచ్చితమైన కొలతలు వస్తాయి. ప్రతీ పిటిషన్‌ను ఆన్‌లైన్ చేస్తున్నాం. 15 రోజుల్లో సమస్యలకు పరిష్కారం చూపుతాం. పరిష్కారాన్ని కూడా ఆన్‌లైన్ చేస్తాం. రీసర్వేలోని లోపాల్ని నిక్కచ్చిగా సవరిస్తామని నమ్మకం ఉంది.

రాష్ట్రస్థాయి పోటీలకు చెన్నపల్లిపాలెం విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్, కరాటే, వాలీబాల్, క్రికెట్ జట్లకు చెన్నపల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందీప్, ముఖేష్, శశాంక్, సాయి, లిల్లీ, వేణుగోపాల్ ఎంపిక అయినట్లు హెచ్‌ఎం సాయికుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వీరంతా త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, నాగరాజు, ఫణికుమార్, కైలాసం రాజా తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

సైదాపురం, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చావడి వద్ద ఏర్పాటుచేసిన తాత్కాలిక మండపంలో బుధవారం తెల్లవారు జామున పోలేరమ్మ కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా మండల చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు చేరుకుని పోలేరమ్మను దర్శించుకుని పూజలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాపూరు సీఐ విజయ్‌కృష్ణ ఏర్పాట్లను పరిశీలించారు. వీరి వెంట ఎస్‌ఐ కాంతికుమార్ పాల్గొన్నారు. గురువారం సాయంత్రం పోలేరమ్మను నిమజ్జనానికి తరలించడంతో జాతర ముగుస్తుంది.



తాత్కాలిక మండపంలో కొలువు దీరిన పోలేరమ్మ

రోడ్ల మరమ్మత్తులు వేగంగా పూర్తికావాలి : కమిషనర్

నెల్లూరు(సిటీ), అక్టోబరు23(ఆంధ్రజ్యోతి) : ఇటీవల భారీ వర్షాలకు నగరంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు వేగంగా పూర్తి కావాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఈ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. డివిజన్ల వారీగా సేకరించిన సమాచారం మేరకు గుర్తించిన ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. కాగా, నగరంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కార్పొరేషన్ ఉద్యోగులు బుధవారం తొలగించారు. అల్లీపురం డంపింగ్ యార్డు వద్ద రోడ్డుమీద చెత్తవేయడాన్ని గమనించిన ఆరోగ్య విభాగం అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని రోడ్డుపై వ్యర్థాలు వేస్తున్న వారిని హెచ్చరించారు. చెత్త తరలింపు వాహనాలు రోడ్డుకు అడ్డంగా పెట్టడంపై సిబ్బందికి సూచనలు చేశారు. ఇరగాళమ్మ సంఘం వద్ద రోడ్డుపై వ్యర్థాలున్నట్లు ఫిర్యాదులు అందడంతో కమిషనర్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు ట్రాక్టర్ల ద్వారా చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు.

● ఇద్దరికి ఉద్యోగోన్నతి

కార్పొరేషన్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న పద్మ, సిద్దిఖ్‌లకు సూపరింటెండెంట్లు ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ సూర్యతేజ ఉత్తర్వులు అందచేశారు. కాగా, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏడీసీ నందన్ బుధవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

చౌకగా రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

నెల్లూరు వైద్యం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అపోలో ఆసుపత్రిలో అతి తక్కువ ఖర్చుతో రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్ వెల్లడించారు. ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.1500 విలువ చేసే ఈ స్క్రీనింగ్ పరీక్షలు రూ.499కే చేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశం డిసెంబరు 31వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. మరో మూడు నెలల్లో ఆసుపత్రిలో రేడియేషన్ అంకాలజీ సేవలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అంకాలజీ ఫిజీషియన్ డాక్టర్ హరిత, అంకాలజీ సర్జన్ డాక్టర్ మనోభిరామ్, ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు. స్క్రీనింగ్‌పరీక్షల పోస్టర్లు విడుదల చేశారు.

కాకాణిపై టీడీపీ నేతల ఫిర్యాదు

ముత్తుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో అసత్య, అసందర్భ ప్రేలాపనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మండల టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్ మాట్లాడుతూ మట్టి నుంచి మద్యం వరకు అవినీతి, అక్రమ అక్రమాల బురదలో కూరుకుపోయిన కాకాణికి అధికారం పోవడంతో పిచ్చిపట్టిందన్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కాకాణికి అందరూ అలాగే కనిపిస్తున్నారని అన్నారు. కాకాణి పాపాలు, నియోజకవర్గంలో అధికారుల పాలిట శాపాలుగా మారాయన్నారు. లేనిపోని ఆరోపణలతో ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డి, ఆయన కుమారుడు రాజగోపాల్‌రెడ్డిపై సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఎస్‌ఐ విశ్వనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశామన్నారు.విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, ఏకొల్లు కోదండయ్య, బొలిగర్ల శ్రీనివాసులు, అక్కయ్యగారి ఏడుకొండలు, సుంకర శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమగ్ర వివరాలు

నెల్లూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా సమగ్ర వివరాలు రికార్డు చేయడం జరుగుతుందని రూరల్ తహసీల్దారు లాజరస్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గొల్లకందుకూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెవెన్యూ వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాస్తవాలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారని చెప్పారు. ఈ సదస్సుల్లో అందరూ పాల్గొని రెవెన్యూ పరంగా ఉండే ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొల్లకందుకూరు, సజ్జాపురం సర్పంచులు దొరసానమ్మ, నారాయణ, నాయకులు పొణక హరిప్రసాద్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతపేట స్టేషన్‌లో ఓపెన్‌హౌస్

నెల్లూరు క్రైం, (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని సంతపేట పోలీసు స్టేషన్‌లో బుధవారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీలక్ష్మీ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు పాల్గొనగా వారికి పోలీసుల విధి నిర్వహణ, కేసుల నమోదు, స్టేషన్ పనితీరు, బాలల రక్షణ చట్టాలు తదితర అంశాలపై ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు బాలకృష్ణ, సుల్తాన్‌బాషా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్దేశిత ప్రాంతాల్లోనే టపాసుల దుకాణాలు పెట్టాలి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రానున్న దీపావళి పండుగ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రాంతాల్లోనే టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయాలని నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష ఆదేశించారు. ఆమె కార్యాలయంలో బుధవారం ఉదయం అగ్ని మాపక, పోలీస్, వాణిజ్య పన్నుల శాఖల అధికారులు, టపాసుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిర్దేశిత ప్రాంతాలు కాకుండా ఇతర చోట్ల దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణ యజమానులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు కడితేనే లైసెన్సులు రెన్యువల్ చేస్తామని స్పష్టం చేశారు. దుకాణాల కేటాయింపును డిప్ ప్రక్రియలో పారదర్శకంగా చేపడతామన్నారు. ఈ సమావేశంలో కార్యాలయ ఏవో రాఘవేంద్ర, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంలో శారీరక, మానసిక రుగ్మతలు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అయోడిన్ లోపం వల్ల పిల్లల శారీరక, మానసిన ఎదుగుదల దెబ్బతింటుందని వైద్య ఆరోగ్యశాఖ ఫ్లోరోసిస్ విభాగం జిల్లా అధికారి డాక్టర్ దివ్య వెల్లడించారు. బుధవారం నగరంలోని ఈఎస్‌ఆర్‌ఎం హైస్కూల్, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో విద్యార్థులు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల గాయిటర్, హైపో థైరాయిడిజం, క్రెటినిజం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో అయోడిన్ ఉప్పునే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రతిమ, ఎన్‌సీడీ సోషల్ వర్కర్ హాసిని, కమ్యూనిటీ ఆర్గనైజర్ తిరుపతయ్య వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జగన్ దెబ్బకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు

● మండల సమావేశంలో సభ్యులు

నెల్లూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :'ఇంటి నిర్మాణాలకు లబ్ధిదారులెవ్వరూ ముందుకు రావడంలేదు. జగన్ ప్రభుత్వం కేటాయించిన స్థలం, ఇస్తామన్న నిధులు సరిపోవని ఎవరూ ఆసక్తి చూపడం లేదు. కావాలంటే జాబితా నుంచి తమ పేర్లు తొలగించుకోమంటున్నారు' అని మండల సమావేశంలో సర్పంచ్, ఎంపీటీసీ లు వాపోయారు. బుధవారం నెల్లూరు రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. గృహ నిర్మాణంపై సమీక్ష సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీలు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇంటి స్థలం పరిమాణం పెంచుతుందని, వ్యయం కూడా పెంచే అవకాశం ఉందని ఆశలుపెట్టుకున్న లబ్ధిదారులు జగనన్న కాలనీలపై ఆసక్తిగా లేరన్నారు. కాగా, ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరవడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూడిద విజయకుమార్, ఎంపీడీవో శైలేంద్రకుమార్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లాభక్షు, సీడీపీవో లక్ష్మీదేవి, వ్యవసాయ శాఖ ఏవో నాగమోహన్, ఎంఈవో మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి బంగారుపూత కవచాల బహూకరణ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి అదానీ పోర్టు సీఈవో జీ జగన్నాథరావు, పుష్పారావు దంపతులు 4 కేజీల 203 గ్రాముల రాగిపై బంగారం పూత పూసిన కవచాలను బహూకరించారు. అమ్మవారికి కవచాలు, హస్తాలు, పాదాలు, కిరీటం, కర్ణ పత్రాలను ఆలయ ఛైర్మన్ రత్నం జయరామ్, జిల్లా సహాయ కమిషనర్, ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామ శర్మకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలు చేశారు.

అనాథ శరణాలయానికి టపాసులు..

దీపావళి పండుగ సందర్భంగా నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయంలోని బాలల కోసం నీలిశెట్టి లక్ష్మణరావు, బీజేపీ నాయకుడు మిడతల రమేష్ బుధవారం టపాకాయలు బహూకరించారు. శరణాలయం నిర్వాహకుడు జీవీ సాంబశివరావుకు వీటిని అందజేశారు.

విహారయాత్రలో విషాదం

● ఉబ్బలమడుగులో మునిగి మనుబోలు యువకుడి మృతి

వరదయ్యపాళెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా గడిపేందుకు విహార యాత్రకు వచ్చిన ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఉబ్బలమడుగు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా మనుబోలుకు చెందిన భరత్‌కుమార్(19) తన స్నేహితులతో కలిసి విహారయాత్ర కోసం ఉబ్బల మడుగుకు వచ్చాడు. మడుగులో స్నానం చే స్తూ.. లోతు ప్రాంతానికి వెళ్లి ఈత రాకపోవడం తో మునిగిపోయాడు. భరత్‌కుమార్ ఎంతసేపటికీ పైకి రాకపోవడంతో గమనించిన అతని స్నేహితులు బుచ్చినాయుడుకండ్రిగ పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. మడుగువద్దకు చేరుకున్న పోలీసులు భరత్ కుమార్ మృతదేహాన్ని వెలికి తీసి సూళ్ళూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బీఎన్‌కండ్రిగ ఎస్‌ఐ విశ్వనాథం తెలిపారు.



ప్రముఖులతో శరణ్యరెడ్డి

భారతీయ నృత్య సెమినార్‌లో శరణ్య

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈనెల 16 నుం చి 21వతేదీ వరకు జరిగిన అంతర్జాతీయ ఇండి యన్ డాన్స్ సెమినార్‌లో నగరానికి చెందిన కూ చిపూడి నృత్యకారిణి చెన్నారెడ్డి శరణ్యరెడ్డి పాల్గొన్నారు. కూచిపూడి ఆంధ్రుల సంప్రదాయ నృత్యమని, పురాణాలకు ఇతి హాసాలకు అద్దంపట్టే కళ అని తెలిపి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. భారతీయ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెమినార్‌లో భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



వచ్చేశామోచ్!

● కాస్త లేటైంది.. అంతే



ఆకాశంలో చక్కర్లు కొడుతున్న పక్షులు



నేలపట్టు చెరువులోని కడపచెట్లపై పక్షులు



తెల్లకంకణాయిలు





● నేలపట్టుకు మొదలైన విదేశీ విహంగాల రాకడ

నేలపట్టుకు వలస విహంగాల రాకడ మొదలైంది. సాధారణంగా అక్టోబరు తొలివారంలోనే రావలసిన ఈ పక్షులు కొంత ఆలస్యంగా వచ్చాయి. అయిదు రోజులుగా నేలపట్టు చెరువుల్లోని కడపచెట్ల మీద తెల్ల కొంగలు సందడి చేస్తున్నాయి. ఈ ఏడాది వానలు ఆలస్యం కావడంతో ఈ విదేశీ అతిథులు ఇప్పుడిప్పుడే రావడం మొదలు పెట్టాయి. నత్తగుల్ల కొంగలు, పెలికాన్‌లతో పాటూ తెల్లకంకణాయి(వైట్ఐబీస్)లు 245 వచ్చాయి. నీటికాకులు (లిటిల్ కార్మోరెంట్స్) 53, చుక్కమూతి బాతులు (స్పాట్ బిల్డ్ డక్స్ 4, డాబ్‌చిక్స్ 2 విడిదిలో ప్రస్తుతం ఉన్నాయి. పక్షుల సందడి మొదలవడంతో నేలపట్టుకు సందర్శకులను అనుమతిస్తున్నారు.

సందర్శన వేళలు: ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు

నేలపట్టుకు తొలి అతిథులు ఈ నత్తగుల్ల కొంగలు (ఓపెన్ బిల్డ్ స్టార్క్). ఇప్పటికే 805 పక్షులు ఇక్కడికి చేరుకున్నాయి.



పెలికాన్ ప్యారడైజ్

నేలపట్టుకు పెలికాన్ ప్యారడైజ్ అనే పేరు రావడానికి కారణం ఇవే! ఈ గూడబాతుల రాక సోమవారం నుంచీ మొదలైంది. ఇప్పటికి 122 గూడబాతులు నేలపట్టులో వాలాయి. ఇక రోజూ గుంపులు గుంపులుగా వస్తాయి. వేల సంఖ్యలో నేలపట్టులో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయి. ఆస్ట్రేలియా, శ్రీలంక, దక్షిణాఫ్రిక దేశాల నుంచి ఇవి ఎక్కువగా నేలపట్టుకు చేరుకుంటాయి. చెరువుల్లోని చెట్లపై కట్టుకున్న గూడుల్లో చేరి, జతకట్టి, గుడ్లుపెట్టి, పిల్లల్ని చేస్తాయి. ఆ పిల్లలకు రెక్కలొచ్చేదాకా పులికాట్ నుంచి చేపలు తెచ్చి తినిపిస్తాయి. రెక్కల్లో బలం వచ్చాక వెంట తీసుకుని ఎగిరిపోతాయి.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి





వర్కింగ్ చైర్మన్ హోదాతో

నా పేరు లేకుండా శిలాఫలకమా!

ఆయన రుయాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు. కానీ, వర్కింగ్ కమిటీ చైర్మన్‌ని అని చెప్పుకొంటారు. అలాగని ఆస్పత్రి వద్ద ఫ్లెక్సీల్లోనూ హోదా పెట్టుకున్నారు. నిజానికి ఈ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, కో చైర్మన్‌గా ఎమ్మెల్యే వ్యవహరిస్తారు. వర్కింగ్ కమిటీ చైర్మన్ హోదానే లేదు. అయినా, సభ్యుడైన బండ్ల లక్ష్మీపతి ఈ హోదా చెప్పుకొని చెలామణి అవుతున్నారు. ఆస్పత్రిలో శిలాఫలకంపై పేరుకోసం.. కారుకు అడ్డొచ్చాడని ఆటో డ్రైవరుపై బుధవారం బండ్ల లక్ష్మీపతి చేసిన రుబాబు తీవ్ర విమర్శలకు గురైంది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

● రుయాలో హెచ్‌డీఎస్ సభ్యుడి వీరంగం
● వైద్యుల వ్యక్తిగత కార్యక్రమమని చెప్పినా వినిపించుకోని వైనం
● చివరకు శిలాఫలకం తొలగింపు



చిన్నపిల్లల విభాగం ముందు ఏర్పాటు చేస్తున్న డాక్టర్ ఇందిరా బాయ్ విగ్రహం

'వర్కింగ్ చైర్మన్ హోదాతో నా పేరు లేకుండా శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తారా? వెంటనే దానిని తొలగించి.. నా పేరుతో ఏర్పాటు చేయండి' అంటూ రుయాస్పత్రి హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) సభ్యుడు బండ్ల చలపతి బుధవారం వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రుయాలోని చిన్న పిల్లల వార్డులో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. 1967 నుంచి 1983 వరకు ఎస్వీ వైద్య కళాశాల బోధనాస్పత్రి అయిన రుయాస్పత్రిలో డాక్టర్ కె.ఇందిరా బాయ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఆమె ఆస్పత్రి కోసం ఎంతో కృషి చేసి ప్రత్యేకంగా చిన్నపిల్లల విభాగాన్ని తీసుకొచ్చారు. దీంతోపాటు అదనంగా పీజీ, ఎండీ సీట్లు వచ్చేందుకూ ఎంతో కృషి చేశారు. డాక్టర్ బీసీ రాయ్ వంటి ఎన్నో జాతీయ అవార్డులను అందుకున్నారు. ఇప్పటికీ చిన్నపిల్లల విభాగంలో ఈమె చిత్రపటం భారీ స్థాయిలో కనిపిస్తుంది. అలాగే అప్పటి విద్యార్థులకు ఆమె ఆదర్శంగా నిలిచారు. ఆమె వద్ద వైద్య విద్య నేర్చుకున్న 1977 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు (ప్రస్తుత డాక్టర్లు) చిన్నపిల్లల విభాగం ముందు ఆమె విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు అధికారుల అనుమతితో విగ్రహం ఏర్పాటు చేశారు. దీనికింద ప్రత్యేక అతిథులతోపాటు, నిర్వాహకుల పేర్లతో మంగళవారం శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 31న విగ్రహ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



శిలాఫలకాన్ని తొలగించి మూలన పెట్టిన సిబ్బంది

హెచ్‌డీఎస్ సభ్యుడి వీరంగం

విగ్రహం ఏర్పాటు విషయం తెలుసుకున్న హెచ్‌డీఎస్ సభ్యుడు బండ్ల లక్ష్మీపతి బుధవారం చిన్నపిల్లల విభాగానికి చేరుకొన్నారు. పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ హోదాతో తన పేరు ఎందుకు రాయించలేదని అక్కడ వైద్యులను ప్రశ్నించారు. ఇది పూర్వ వైద్య విద్యార్థుల వ్యక్తిగత కార్యక్రమమని చెప్పడంతో.. వారిపై ఆగ్రహించారు. 'ఇదేమైనా మీ సొంతిల్లు అనుకుంటున్నారా? ఇక్కడ మీ ఇష్టం వచ్చినట్లు చేస్తే ఊరుకునేది లేదు. వెంటనే శిలాఫలకాన్ని తొలగించి, వర్కింగ్ చైర్మన్ హోదాతో నా పేరు రాసి ఏర్పాటు చేయండి. లేకపోతే విగ్రహం కూడా తొలగించండి' అంటూ హెచ్చరించారు. ఈ విషయాన్ని సూపరింటెండెంట్, ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళతామని వైద్యులు ఆయనకు చెప్పగా.. ఆస్పత్రికి వర్కింగ్ చైర్మన్‌ను తాను అని, తాను చెప్పింది చేయాలని ఆర్డరు వేశారు. తన పక్కనున్న వ్యక్తిగత మనుషులతో ఆస్పత్రిలో సెక్యూరిటీ, పారిశుధ్య సిబ్బందిని పిలిపించి ఆ శిలాఫలకాన్ని తొలగించేశారు. తిరిగి శిలాఫలకం ఏర్పాటు చేయాలంటే వర్కింగ్ చైర్మన్ హోదాతో తన పేరు రాయాలని స్పష్టంచేశారు.



హెచ్‌డీఎస్ వర్కింగ్ చైర్మన్ అంటూ రుయాస్పత్రిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఇప్పుడే ఇలాగా...

ఎస్వీ వైద్య కళాశాలలో, రుయాస్పత్రిలో పూర్వపు విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు అనేకం చేస్తుంటారు. ఇందులో ఇంత వరకు ఎప్పుడూ రాజకీయ నేతల జోక్యం ఉండేది కాదు. ఇప్పుడే తమ కార్యక్రమాలను అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వైద్యాధికారులు అంటున్నారు. ఇలాగైతే ఇప్పటిలా అభివృద్ధి కార్యక్రమాలకు పూర్వపు విద్యార్థులు ముందుకు వచ్చే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చైర్మన్ కారుకే

అడ్డొస్తావా?

● ఆటో తాళాలు లాక్కొని అవుట్‌పోస్టులో ఇచ్చిన రుయా హెచ్‌డీఎస్ సభ్యుడు
● ఆక్సిజన్ మాస్కుతో రోగికి తప్పని నిరీక్షణ

'ఆస్పత్రిలో చైర్మన్ కారుకే అడ్డు వస్తావా? అసలు ఆస్పత్రిలోకి ఆటోను ఎవరు అనుమతించారు?' అంటూ రోగిని తీసుకువచ్చిన ఆటో డ్రైవరుపై రుయా హెచ్‌డీఎస్ సభ్యుడు బండ్ల లక్ష్మీపతి బుధవారం విరుచుకుపడ్డారు. ఆయన తీరుతో ఆక్సిజన్‌పై ఉన్న రోగి గంటకుపైగా ఆటోలోనే నిరీక్షించాల్సి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. తీవ్ర ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ ఆక్సిజన్‌పై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగిని వైద్యుల సూచనల మేరకు పరిపాలనా భవనంలో ఉన్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం ఆటోలో తీసుకొచ్చారు. అదే సమయంలో అక్కడకు హెచ్‌డీఎస్ సభ్యుడు లక్ష్మీపతి కారు వచ్చింది. ఆయన కారుకు ఆ ఆటో అడ్డురావడంతో వెంటనే ఆయన కిందకు దిగారు. నీ ఆటోను ఇక్కడ వరకు అనుమతించింది ఎవరంటూ ఆటో డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. నడవలేని పరిస్థితిలో ఆక్సిజన్‌పై రోగిని స్కానింగ్ కోసం తీసుకువచ్చానని డ్రైవరు చెబుతున్నా వినిపించుకోలేదు. బలవంతంగా ఆటో తాళాలు తీసుకొని పక్కనే ఉన్న అవుట్ పోస్టులోని పోలీసులకు అప్పగించారు. మరోసారి ఇలా అడ్డం వస్తే నువ్వు నీ ఆటో బయటకు పోరని గట్టిగా మందలించి వెళ్లిపోయారు. అనంతరం ఆటో డ్రైవరు జరిగిన విషయం అవుట్ పోస్టులోని పోలీసులకు చెప్పి బతిమలాడుకోవడంతో చివరకు ఆటో తాళాలు ఇచ్చారు. అప్పటి వరకు దాదాపు గంటకుపైగా ఆటోలో ఆక్సిజన్ మాస్కుతో రోగి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో ఆక్సిజన్ అయిపోయివుంటే పరిస్థితి ఏంటని రోగి సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆక్సిజన్ సిలిండరుతో ఆటోలో నిరీక్షిస్తున్న రోగి

వర్కింగ్ కమిటీ చైర్మన్ హోదానే లేదు

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ హోదానే లేదని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. వర్కింగ్ చైర్మన్ పేరుతో కమిటీ సభ్యుడు బండ్ల లక్ష్మీపతి చెలామణి అవుతుండటంపై 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆయన పైవిధంగా చెప్పారు. చైర్మన్ హోదాలో కలెక్టరు, కో చైర్మన్ హోదాలో స్థానిక ఎమ్మెల్యే మాత్రమే ఉంటారని, మిగిలిన వారంతా సభ్యులేనని తేల్చిచెప్పారు. వర్కింగ్ చైర్మన్ అని కమిటీ సభ్యుడు చెప్పుకుంటున్న విషయం తమ దృష్టికి కూడా వచ్చిందన్నారు. అలా చెప్పరాదని ఇప్పటికే చెప్పామని, మరోసారి పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు. వర్కింగ్ చైర్మన్ హోదాతో ఆస్పత్రి ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా తొలగించాలని సూచించామన్నారు.



థ్యాంక్యూ బర్డ్

● పోలియో బాధితులను నడిపించిన ఆస్పత్రి
● పదేళ్ల కిందటి వరకు విస్తృత సేవలు
● ఆపై ఒక్క కేసూ రాకపోవడంతో ఇతర వైద్యసేవలపై దృష్టి

6

ఎస్వీఆర్ డిస్టిలరీస్‌లో ముగిసిన సీఐడీ తనిఖీలు

● పలు రికార్డులు, హార్డు డిస్కులు స్వాధీనం
● ఉత్పత్తికి.. సరఫరాకు మధ్య తేడాలున్నట్లు సమాచారం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలోని ఎస్వీఆర్ డిస్టిలరీస్‌లో సీఐడీ అధికారుల బృందం మంగళవారం చేపట్టిన తనిఖీలు బుధవారం ముగిశాయి. విజయవాడ నుంచి వచ్చిన సీఐడీ అధికారులు బృందాలుగా ఏర్పడి కొన్ని అంశాలు చొప్పున పరిశీలించారు. 2019లో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటైనప్పటి నుంచీ ఈ ఏడాది ఎన్నికల నాటి వరకూ డిస్టిలరీస్‌లో జరిగిన మద్యం తయారీ, ఉత్పత్తి, సరఫరా తదితర అంశాలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు. అదే సమయంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఓ రాజకీయ ప్రముఖుడి సంస్థ ఈ డిస్టిలరీస్‌ను లీజుకు తీసుకున్నప్పటి నుంచీ జరిగిన కార్యకలాపాలపైనా సమాచారం తీసుకున్నారు. మద్యం సీసాలపై అతికించే సీళ్ల పక్కదారి పట్టినట్టు, అలాగే తయారైన మద్యం పరిమాణానికి, బయటకు సరఫరా చేసిన మద్యం పరిమాణానికి నడుమ వ్యత్యాసం గుర్తించినట్టు తెలిసింది. అలాగే ఎక్సైజ్ డ్యూటీ చెల్లింపుల్లో కూడా కొంతమేరకు తేడాలను గుర్తించినట్టు సమాచారం. ఈ అంశాలకు సంబంధించి సీఐడీ అధికారులు ఎలాంటి అధికారిక సమాచారం ఇవ్వలేదు. కాగా డిస్టిలరీస్‌లో గత ఐదేళ్లలో మద్యం తయారీకి సంబంధించి డిస్టిలరీస్ ప్రతినిధుల నుంచీ చివరికి హమాలీల నుంచీ కూడా స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు సమాచారం. 2019-2024 నడుమ జరిగిన మద్యం తయారీ, ఉత్పత్తి, సరఫరాలకు సంబంధించిన పూర్తి రికార్డులను సీఐడీ అధికారులు సీజ్ చేశారు. కంప్యూటర్లకు సంబంధించిన హార్డు డిస్కులను కూడా స్వాధీనం చేసుకుని రికార్డులతో పాటు విజయవాడకు తీసుకెళ్లారు. అక్కడ పూర్తి స్థాయిలో వాటిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

● ఐదేళ్ల కొడుకు సహా తండ్రి మృతి
● తల్లికి తీవ్రగాయాలు
● చియ్యవరంలో విషాదం



చికిత్స పొందుతున్న గుర్రమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 23: ద్విచక్ర వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ఐదేళ్ల కొడుకు సహా తండ్రి మృతి చెందగా తల్లి చికిత్స పొందుతోంది. ఈ ఘటన బుధవారం రాత్రి శ్రీకాళహస్తి మండలం దొమ్మరపాళెం వద్ద కాసరం రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన ప్రకారం.. తొట్టంబేడు మండలం చియ్యవరానికి చెందిన రాజేంద్రన్(35) రైతు. బుధవారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలో పనులు ముగించుకుని భార్య గుర్రమ్మ, కుమారుడు చైతన్య(5)తో ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. దొమ్మరపాళెం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడగా, గుర్రమ్మ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చైతన్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రగాయాలతో విషమ పరిస్థితిలో ఉన్న రాజేంద్రను బంధువులు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. గుర్రమ్మ ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రూరల్ పోలీసులు మృతదేహాలను ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ రవినాయక్ తెలిపారు.





చైతన్య - రాజేంద్రన్ (ఫైల్ ఫొటోలు)



రూ.ఐదుకు ఏం వస్తుంది

టీ తాగాలంటే కనీసం పది రూపాయలు ఖర్చు పెట్టాలి. అదే అన్న క్యాంటీన్‌లో రూ.ఐదుకి కడుపునిండా భోజనం చేయొచ్చు. వెంకటగిరిలోని అన్న క్యాంటీన్‌లో బుధవారం నుంచి ఉదయం అల్పాహారంతో పాటు రెండు పూటలా భోజనాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీంతో నిరుపేదలు, కూలీలు, కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే తాము భోజనానికి ఇంటికి వెళ్లకుండా, రూ.5కే భోజనం చేయగలుగుతున్నామని పలువురు చెప్పారు. హోటళ్లకు వెళ్లి భోజనం చేసే స్థోమతలేని వారికి అన్న క్యాంటీన్ ఆకలి తీరుస్తోంది.

- వెంకటగిరి, ఆంధ్రజ్యోతి

రికార్డులన్నీ ఓకేనా..!

ఇప్పుడన్ని కార్యాలయాలు డిజిటల్‌గా మారుతున్నాయి. రెవెన్యూలోనూ చాలావరకు కంప్యూటరైజ్ చేశారు. అయినా, పాత రికార్డులన్నీ కార్యాలయంలోని ఓ గదిలో భద్రంగా ఉంచారు. అలా బాలాయపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఉంచిన రికార్డులను బుధవారం కలెక్టరు వెంకటేశ్వర్ పరిశీలించారు. వర్షాలకు ఉరవడం వల్ల ఏమైనా తడిచాయా అని చూశారు.

- బాలాయపల్లి, ఆంధ్రజ్యోతి



నేడు ప్రపంచ పోలియో నివారణ దినం



థ్యాంక్యూ బర్డ్

పోలియోతో శారీరకంగానే కాదు మానసికంగా కూడా కుంగిపోయినవారి పాలిట ఆశాదీపంలా ఒకప్పుడు వెలిగింది తిరుపతిలోని బర్డ్ (బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సర్జరీ, రీసెర్చ్, అండ్ రీహాబిలిటేషన్ పర్ ది డిజేబుల్డ్). దేశం నలుమూలల నుంచీ నిత్యం వందలాదిమంది వైకల్యంతో ఈ ప్రాంగణంలో కనిపించేవారు. సర్జరీ, ఫిజియోథెరపీల తర్వాత కృత్రిమ కాళ్లతో నడుస్తూ ఆత్మవిశ్వాసం పెంచుకుని ఊళ్లకు వెళ్లేవారు. దేశంలో ఎక్కడి నుంచి వచ్చినా.. ఉండడానికి వసతి చూపి, తినడానికి తిండి పెట్టి, ఆపరేషన్ చేసి పంపేవారు. సకలమూ ఉచితమే ఇక్కడ. తిరుపతికి వచ్చే అనేక రైళ్లలో ఒకప్పుడు పోలీయో వల్ల వైకల్యానికి గురైన పిల్లలే కనిపించేవారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు మదిలో మెదిలి తిరుపతిలో ప్రాణం పోసుకున్న ఆసుపత్రే బర్డ్. పేదల కోసం టీటీడీ ఆధ్వర్యంలో దీనిని 1985లో ప్రారంభించారు. ఈక్రమంలో 1994లో బర్డ్ ఒక ట్రస్ట్‌గా ఏర్పాటై దేశవ్యాప్త సేవలందించింది. పోలియో వాక్సిన్‌తో ప్రభుత్వాలు తీసుకున్న గట్టి చర్యల వల్ల దాదాపుగా ఇప్పుడీ వ్యాధి అంతరించింది. పదేళ్లుగా ఒక్కటంటే ఒక్క పోలీయో కేసు బర్డ్‌కు రాలేదు. దీంతో బర్డ్ ఇతర వైద్య సేవల్లోకి విస్తరించింది. మోకీళ్ల, తుంటి మార్పిడి చికిత్సలపై దృష్టి పెట్టింది. బర్డ్‌లో ఎందరో డాక్టర్లు సేవా దృక్పథంతో సేవలందించారు. బర్డ్ అనగానే ఇద్దరి పేర్లు అందరి మదిలో మెదులుతాయి. వ్యాఘ్రేశ్వరుడు, జగదీష్‌ల సారథ్యంలో బర్డ్ సేవలు దేశవ్యాపితంగా అందాయి. ప్రపంచ పోలియో నివారణ దినం సందర్భంగా బర్డ్ వైద్యులకు నమస్కరించుకుంటూ బర్డ్ సేవలను గుర్తు చేసుకుందాం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పోలియో రోగులకు బర్డ్ సేవలు

- బర్డ్ ఆసుత్రిలో 90,589 మంది పోలియో వ్యాధిగ్రస్తులకు ఆపరేషన్లు చేశారు.
- బర్డ్ వైద్యులే దేశంలోని అనేక ప్రాంతాలకు వెళ్లి శిబిరాలు నిర్వహించి, 11448 మందికి ఆ ప్రాంతాల్లోనే ఆపరేషన్లు చేశారు.
- పోలియో స్ర్కీనింగ్ శిబిరాల ద్వారా పరీక్షించిన రోగుల సంఖ్య: 83,173
- ఆపరేషన్ అవసరమని గుర్తించినది: 73,539
- బర్డ్ ద్వారా బూట్లు వంటి పరికరాలు అందుకున్న రోగులు: 9466





డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడు బర్డ్ తొలి డైరెక్టర్‌గా (1984-87) విశేష కృషి చేశారు. దేశవ్యాప్తంగా ఉచిత పోలియో శిబిరాలు నిర్వహించే కార్యక్రమం ఈయన ప్రారంభించారు.



డాక్టర్ జగదీష్ బర్డ్ డైరెక్టర్‌గా (1993-2019) సుదీర్ఘకాలం సేవలందించారు. దేశంలోని అనేకప్రాంతాల్లో పర్యటిస్తూ వైద్యసేవలందించేవారు. పోలియో సహా అనేక రకాల ఆపరేషన్లు దాదాపు 90 వేలు ఈయన సారథ్యంలో జరిగాయి.

- మన దేశంలో 1972లో పోలియో వ్యాక్సినేషన్ ప్రారంభమైంది.1985లో దాదాపు అన్ని జిల్లాలకు విస్తరించింది.
- చివరి పోలియో కేసులో 2011లో పశ్చిమ బెంగాల్, గుజరాత్‌లలో నమోదయ్యాయి.
- 2014లో భారత్‌ను పోలియో రహితదేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

జనవరి రూ.300 దర్శన టికెట్ల కోటా విడుదల నేడు

- శ్రీవాణి టికెట్లు కూడా -

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను టీటీడీ గురువారం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికార వెబ్‌సైట్ 'తిరుమలతిరుపతిదేవస్థానమ్స్' ద్వారా విడుదల చేస్తారు. జనవరిలో 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలు ఉండటంతో భక్తులు ఈ టికెట్ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.అలాగే ఉదయం 11గంటలకు జనవరి నెలకు సంబంధించిన శ్రీవాణి ట్రస్టు దాతల బ్రేక్ దర్శన టికెట్లను కూడా విడుదల చేయనున్నారు. రోజుకు 500 టికెట్ల చొప్పున వైకుంఠ ఏకాదశి రోజులను మినహాయించి విడుదల చేయనున్నారు.

పుదుచ్చేరి సీఎం సిఫార్సు లేఖపై శ్రీవారి దర్శన టికెట్లు పొంది బ్లాక్‌లో విక్రయం

- అదుపులోకి తీసుకున్న టీటీడీ విజిలెన్స్ -

తిరుమల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సీఎం సిఫార్సు లేఖపై పొందిన శ్రీవారి దర్శన టికెట్లను ఓ వ్యక్తి బ్లాక్‌లో విక్రయించాడు. వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు ఇస్తానని చెప్పి రూ.300 దర్శన టికెట్లు ఇవ్వడంతో ఈ అక్రమం వెలుగులోకి వచ్చింది.టీటీడీ విజిలెన్స్ అధికారుల కథనం మేరకు... నెల్లూరుకు చెందిన మురళీ శంకర్‌రెడ్డి ఐదు వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు కావాలని తిరుపతిలో వుంటోన్న పుదుచ్చేరికి చెందిన పద్మనాభన్ అలియాస్ భరత్ అనే దళారీని సంప్రదించాడు.ఒక్కో బ్రేక్ టికెట్‌కు రూ.4,600 చొప్పున ఐదు టికెట్లకు రూ.23 వేలు బద్మనాభన్ వసూలు చేశాడు.మంగళవారం దర్శనానికి వచ్చిన మురళీ శంకర్‌రెడ్డికి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు ఇవ్వకుండా రూ.300 దర్శన టికెట్లు ఇవ్వడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.గమనించిన విజిలెన్స్ అధికారులు పద్మనాభన్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో ఈ విషయం వెలుగు చూసింది. మురళీ శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు నివేదికను తిరుమల టూటౌన్ పోలీసులకు అందజేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● క్రైం కార్నర్

ఈజీ మనీ కోసం..!

- దొంగగా మారిన తమిళనాడు యువకుడి అరెస్టు
- రూ.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



దొంగ అరెస్టును చూపుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లో మునిగి.. చెడు వ్యసనాలకు బానిసై... ఈజీ మనీ కోసం 20కిపైగా చోరీలకు పాల్పడిన అంతరాష్ట్ర సీరియల్ దొంగ శ్రీకాళహస్తి పోలీసులకు పట్టుబడ్డాడు. తిరుపతి జిల్లా పరిధిలోని ఐదు చోరీ కేసుల్లో నిందితుడైన ఆ తమిళనాడు యువకుడిని అరెస్టు చేసి రూ.20లక్షల చోరీ సొత్తు రికవరీ చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి బుధవారం తెలిపిన మేరకు.. ఇటీవల శ్రీకాళహస్తి పట్టణంలో రాత్రి, పగటి వేళల్లో పలు చోరీలు జరిగాయి. ఈ కేసులను ఛేదించేందుకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. సీసీ కెమెరాలు, వేలిముద్రలు, మొబైల్ విశ్లేషణ వంటి అధునాతన పరిజ్ఞానంతో ఆ బృందం విచారణ సాగించింది. ఈ క్రమంలో తమిళనాడు రాష్ట్రం తిరవళ్లూరు జిల్లా పోరూరు ప్రాంతానికి చెందిన భరద్వాజన్ ప్రేమ్‌కుమార్ అలియాస్ కుమార్(30)బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకునే క్రమంలో ప్రేమ్‌కుమార్ పారిపోయేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డాడు. తమిళనాడుకు చెందిన ప్రేమ్‌కుమార్‌గా విచారణలో తేలింది. గతంలో 20 చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు నిర్ధారించారు. జిల్లా పరిధిలోని శ్రీకాళహస్తి పట్టణంలో రెండు, బుచ్చినాయుడు కండ్రిగ, రేణిగుంట, తిరుచానూరు సహా ఐదు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. అతడి నుంచి 220గ్రాముల బంగారు ఆభరణాలు, 2,180 గ్రాముల వెండి వస్తువులు, లాప్‌ట్యాప్, ఐఫోన్ సహా వేలిముద్రలు పడకుండా చేతులకు తొడుకునే గ్లోవ్స్, ఇనుపరాడ్లు స్వాధీనం చేసుకున్నారు. రికవరి చేసుకున్న సొత్తు విలువ రూ.20లక్షలుగా అంచనా వేశారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. సులభ సంపాదన కోసం ఒకడే వెళుతూ చోరీలు చేయడంలో దిట్ట అని డీఎస్పీ తెలిపారు. ఇతడిని పట్టుకోవడంలో కృషి చేసిన శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి, బుచ్చినాయుడు కండ్రిగ సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ సుధాకర్, ఏఎస్‌ఐలు గంగయ్య, చక్రవర్తి, కానిస్టేబుళ్లు హేమాద్రి, రవి, ప్రసాద్, కేశవన్, బాలకృష్ణ, గంగాధరం, అరుణ్, భరత్‌ను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

విహారయాత్రలో విషాదం

- ఉబ్బలమడుగులో మునిగి మనుబోలు యువకుడి మృతి

వరదయ్యపాళెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా గడిపేందుకు విహారయాత్రకు వచ్చిన ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఉబ్బలమడుగు వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా మనుబోలుకు చెందిన భరత్‌కుమార్(19) తన స్నేహితులతో కలిసి ఉబ్బలమడుగుకు వచ్చాడు. మడుగులో స్నానం చేస్తూ.. లోతున్న ప్రాంతానికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. ఎంతసేపటికీ భరత్‌కుమార్ పైకి రాకపోవడంతో అతడి స్నేహితులు బుచ్చినాయుడుకండ్రిగ పోలీసులకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. మడుగువద్దకు చేరుకున్న పోలీసులు భరత్‌కుమార్ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బీఎన్‌కండ్రిగ ఎస్‌ఐ విశ్వనాథం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- భార్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు



హత్యకు గురైన ఈశ్వరయ్య

రేణిగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లికి చెందిన ఈశ్వరయ్య(43) మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అర్బన్ సీఐ శరత్‌చంద్ర తెలిపిన ప్రకారం.. ఈశ్వరయ్యకు 15 ఏళ్ల కిందట సుజాతతో వివాహం జరిగింది. వీరికి నలుగురు పిల్లలు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో భార్యాభర్తలు హౌస్ కీపింగ్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈశ్వరయ్య మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరుగుతోంది. మంగళవారం రాత్రి మిద్దెపై భార్యాభర్తలు నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో మోదారంటూ పోలీసులకు సుజాత ఫిర్యాదు చేసింది. అర్బన్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్ హత్య ప్రదేశంలో వాసన పసిగడుతూ సుజాత వద్ద ఆగింది. దీంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని రుయాస్పత్రి మార్చురికీ తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిత్రలేఖనంలో యామిని ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న యామిని

శ్రీకాళహస్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనం పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన యామిని జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. యామిని పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతోంది. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టం 1994 - ఆడ శిశువును కాపాడుదాం సృష్టిని రక్షిద్దాం' అనే అంశంపై ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైంది. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా నలుమూలల నుంచి హాజరైన విద్యార్థినులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా యామిని మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. డీఆర్వో పెంచలకిషోర్,డీఎంహెచ్‌వో శ్రీహరి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, రూ.5వేలు నగదు ప్రోత్సాహక నగదు బహుమతి చెక్కును అందజేశారు.



యామిని వేసిన చిత్రం

వేద సారాంశంపై విస్తృత ప్రచారం

- విజయేంద్ర సరస్వతి



విద్యార్థులకు అనుగ్రహభాషణం చేస్తున్న విజయేంద్ర సరస్వతి స్వామి

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): అన్ని విద్యల్లో వేద విద్య ఉన్నతమైనదని కంచికామ కోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. తిరుమలలోని ఎస్వీ వేద విజ్ఞానపీఠంలో బుధవారం సాయంత్రం ఆయన వేద విద్యార్థులకు అనుగ్రహ బాషణం చేశారు. ఈసందర్భంగా ఆయనకు వేదవిజ్ఞాన పీఠం అధ్యాపకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ వేద విద్యార్థులు ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వేదాలు అభ్యసించే విద్యార్థులకు స్వరూపం, స్వధర్మం, స్వభావం ముఖ్యమని చెప్పారు. ధర్మాన్ని తెలుసుకోవాలంటే వేదాలను తెలుసుకోవడం తప్పనిసరి అన్నారు. మనది సాధువులు, మహర్షులు నడుపుతున్నా దేశమన్నారు. ధర్మం కోసం త్యాగం చేయాలి కానీ ధర్మాన్ని త్యాగం చేయకూడదన్నారు. వేదాల్లోని బావాలు విస్తృతంగా ప్రచారం చేసినప్పుడే బావితరాలకు మంచి జరుగుతుందన్నారు. ధర్మపరిరక్షణకు ఆహార, ఆలోచన నియమాలు పాటించాలన్నారు. విద్యార్థులందరూ వేద విద్య పూర్తయ్యాక ధర్మానికి కార్యకర్తలుగా పనిచేసి సంస్కృత బాషను ప్రచారం చేయాలని సూచించారు. దేశానికి ధర్మం, ఆలయం, సంస్కృతి, ఆచారం ముఖ్యమని ఉపదేశించారు. ప్రతి గ్రామ ఆలయాన్ని తిరుమల ఆలయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీటీడీ చేస్తున్న అనేక కార్యక్రమాల్లో వేద విజ్ఞాన అభివృద్ధి కార్యక్రమం చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవార్డు అదుకుంటున్న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్

సమష్టి కృషితోనే ఎస్పీడీసీఎల్‌కు అవార్డు

తిరుపతి(ఆటోనగర్) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్‌కు జాతీయ స్థాయిలో అవార్డు రావడం సంతోషంగా ఉందని, సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని సీఎండీ సంతోషరావు పేర్కొన్నారు. దేశంలోని విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరుపై ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఐసిసి) నిర్వహించిన సర్వేలో ఏపీఎస్పీడీసీఎల్‌కు రెండవ స్థానం లభించింది. న్యూఢిల్లీలోని ఓ హోటల్‌లో జరిగిన సదస్సులో ఐసీసీ చైర్మన్, కేంద్ర ఇంధన శాఖ మాజీ కార్యదర్శి అనిల్ రజ్దాన్ చేతుల మీదుగా ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్ ఈ అవార్డు అందుకున్నారు.

26న పూరీ ఎక్స్‌ప్రెస్ రద్దు

తిరుపతి(సెంట్రల్) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుపాను కారణంగా గురువారం పూరీ నుంచి తిరుపతికి బయలుదేరాల్సిన 17479నంబరు గల పూరీ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే యశ్వంతపూర్ నుంచి తిరుపతి మీదుగా హౌరాకు వెళ్లే ఎక్స్‌ప్రెస్(12864)ను బుధవారం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం హౌరా నుంచి బయలుదేరే (12863) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నర్సింగ్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గం



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న నర్సింగ్ సిబ్బంది

తిరుపతి(వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నర్సింగ్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. అసోసియేషన్ ఎన్నికలు రుయాస్పత్రిలో మంగళవారం జరగ్గా, కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడించారు. అధ్యక్షురాలిగా ఎస్.రాదమ్మ, ఉపాధ్యక్షురాలిగా ఎస్.రాణి, కార్యదర్శిగా ఇ.లీలావతి, కోశాధికారిగా ఎం.సారాసు బాషిణీతోపాటు కార్యవర్గ సభ్యులుగా జె.వరలక్ష్మి, కె.పద్మావతి, సి.చంద్రావతి, ఏఆర్ హిమబిందు గెలుపొందారు.

శ్రీసిటీ గ్రామాల్లో కొనసాగుతున్న భూ సర్వే



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

- సర్వే తీరును పరిశీలించిన జేసీ

సత్యవేడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పరిధిలోని కొల్లడం, ఇరుగుళం గ్రామాల్లో రెవెన్యూ అధికారుల భూ సర్వే కొనసాగుతోంది. సత్యవేడు తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా కొల్లడం, ఇరుగుళం, పెద్దఈటిపాకంలలో సర్వేయర్లు, వీఆర్వోల బృందం సర్వే చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ గ్రామాల్లోని ప్రభుత్వ, పట్టా భూములకు సంబంధించిన హక్కుదారులు, వారికి సంబంధించిన రికార్డులను సర్వే బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి బుధవారం సర్వే జరుగుతున్న గ్రామాలకు చేరుకుని సర్వే తీరును పరిశీలించారు. భూముల రికార్డులను జేసీ పరిశీలించి, రెవెన్యూ అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా జేసీ, ఆర్డీవోల మండల పర్యటనను స్థానిక రెవెన్యూ అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

నవంబరు నుంచి కార్డుదారులకు కందిపప్పు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు నవంబర్ నుంచి కందిపప్పు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని 6.35 లక్షల రేషన్ కార్డులకుగాను 600 టన్నుల కందిపప్పు అవసరం. బుధవారం నాటికి 390 టన్నులు 12 ఎంఎల్ఎస్ పాయింట్లలో అందుబాటులో ఉన్నాయని, మిగిలిన 210 టన్నులు మరో రెండు రోజుల్లో తెప్పించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఎస్‌వో సుమతి చెప్పారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి బియ్యంతో పాటు కందిపప్పు కిలో రూ.67, చక్కెర అరకిలో రూ.17 చొప్పున పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 29వ తేదీలోగా సరకులన్నీ రేషన్ దుకాణాలకు చేరేలా చర్యలు చేపట్టామన్నారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు దర రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఇది కార్డుదారులకు శుభవార్త అని చెప్పారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు: కురుగొండ్ల



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

వెంకటగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టరు వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. పేదలతో కలిసి ఎమ్మెల్యే, కలెక్టరు భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ పది రూపాయలకు కాఫీ, టీ దొరకని ఈ రోజుల్లో రూ.5కే కడుపునిండా అన్న పెట్టడం సాధారణ విషయం కాదన్నారు. ఇంటి రుచులకు ఏమాత్రం తీసిపోయిని విధంగా మంచి భోజనాన్ని పేదకు అందుబాటులో తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రుణం తీర్చుకోలేనిదని కొనియాడారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ గ్రామాల్లో కూడా అన్న క్యాంటీన్లు పెట్టాలని వినతులు అందుతున్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. అన్న క్యాంటీన్‌లో మెనూ, వంటకాలు చాలా బాగున్నాయని చెప్పారు. అనంతరం కలెక్టర్ చెవిరెడ్డిపల్లి, మల్లగుడి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు అవ్వారు సత్యనారాయణ, గంగాధర్, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, జీకేపల్లి బాబు నాయుడు, తోట రామచంద్రయ్య, చెలికం మధురెడ్డి, వల్లభనేని మధునాయుడు, మల్లారం బాబు, కాపా శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.





నిర్మాణం పూర్తయి వృథాగా ఉన్న దుకాణ సముదాయం - బజారుకూడలిలో రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యాపారులు

దుకాణ సముదాయం వినియోగంలోకి వచ్చేదెన్నడో?

తడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద నిర్మించిన పంచాయతీ దుకాణ సముదాయం ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉంది. తడ బజారు కూడలిలో రోడ్డు పక్కన పెద్ద సంఖ్యలో దుకాణాలు నిర్వహిస్తున్నారు. అది జాతీయ రహదారి కావడంతో వాహనాల రాకపోకలతో పాటు జన సంచారంతో బజారుకూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. తరచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుండడంతో జాతీయ రహదారి పక్కన ఉన్న దుకాణలను

నిర్మాణం పూర్తయి ఆరేళ్లయినా ఖాళీనే

మరోచోటుకు తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం మరో ప్రాంతంలో గదులు నిర్మించి దుకాణాలను అక్కడకు తరలిస్తే పంచాయతీకి ఆదాయం కూడా వస్తుందని భావించారు. ఆ ఆమేరకు స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో దుకాణ సముదాయం నిర్మించాలని పంచాయతీ నిర్ణయించింది. 2017లో రూ.15 లక్షల వ్యయంతో 25 దుకాణాల నిర్మాణం చేపట్టి 2018లో పూర్తిచేశారు. దుకాణాల ముందు షెడ్ నిర్మించేందుకు మరో రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అయితే 2019లో ప్రభుత్వం మారిపోవడంతో దుకాణాలు ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తీసుకువస్తే ఏటా రూ.6లక్షల నుంచి రూ.7 లక్షల వరకు అద్దె రూపంలో పంచాయతీకి ఆదాయం వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుకాణ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

అనుమానాస్పద స్థితిలో వైసీపీ కార్యకర్త మృతి





మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు - డీఎస్పీ చెంచుబాబుతో కిలివేటి, కామిరెడ్డి వాగ్వాదం



విలపిస్తున్న మృతుడి కుమార్తె, బంధువులు

పెళ్లకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం చిల్లకూరు పంచాయతీ పరిధిలోని వడ్డిపాలెం గ్రామానికి వైసీపీ కార్యకర్త బండి చెంచయ్య(49) అలియాస్ పోతురాజు చెంచయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని స్వర్ణముఖినది ఒడ్డున కాలిన గాయాలతో చెంచయ్య మృతి చెంది ఉండడాన్ని పశువులు కాపరులు గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా ఎన్డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, స్థానిక వైసీపీ సర్పంచు తమ అనుచరులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. చెంచయ్యది హత్యేనని, పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని ఆరోపించారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఆందోళనకారులు వినలేదు. చెంచయ్య మృతదేహాన్ని చేతులపై ఎత్తుకుని 71వ జాతీయ రహదారిపైకి చేరుకుని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ఇంతలో అక్కడకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చిల్లకూరు పంచాయతీలో ఓ వర్గం వ్యక్తులు ఘర్షణలకు దిగుతున్న విషయాన్ని అనేకసార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఎస్‌ఐ నాగరాజు పట్టించుకోకుండా పోవడం వల్లే చెంచయ్యను హత్య చేశారని ఆరోపించారు. ఆందోళనకారుల నిరసనతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు వచ్చి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఆందోళనకారులను చెదరకొట్టి మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ సంగమేశ్వరరావు తెలిపారు. అలాగే అనుమతులు లేకుండా జాతీయ రహదారిపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డితో పాటు మరికొంత మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆస్పత్రి నిర్వహణ ఇలాగేనా

- డక్కిలి ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు
- వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆగ్రహం



వైద్యులను హెచ్చరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

డక్కిలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): డక్కిలి ప్రభుత్వాస్పత్రిని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తనిఖీ చేశారు. వైద్యసేవలు అందించే గదులు, రోగుల వార్డులు, కాన్పుల గదులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బాలింతల వివరాలు నమోదైన రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది ద్వారా వారికి ఫోన్ చేయించి వైద్య సేవలపై ఆరా తీశారు. కాన్పులు చేసే గది ఇలాగానే వుండాల్సింది.. మీ ఇల్లు అయితే ఇలాగా వుంచుకొంటారా.. కనీసం గదిని శుభ్రంగా ఉంచుకోవాలన్న ఆలోచన లేకుండా విధులు నిర్వహిస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు కాన్పులు చేయడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలోని బాలింతలకు కాన్పులు చేస్తే.. ఎక్కడో వున్న ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుందని నిలదీశారు. ఆశా వర్కర్ల ద్వారా గర్భిణులు, బాలింతలు యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వైద్యులదేనని స్పష్టం చేశారు.

ముగ్గురు వైద్యులకు మెమోలు

ఆస్పత్రిలో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులకు మెమోలు జారీ చేయాలని సీసీని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతానికి మెమోలతో సరిపెడుతున్నామని, పనితీరు ఇలాగే ఉంటే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రభుత్వాస్పత్రికి తన భార్యను కాన్పుకోసం తీసుకువస్తే వైద్యుల నిర్లక్ష్యం కారణంగా చనిపోయిందని, అప్పట్లో విచారణ కమిటీని ఏర్పాటు చేసినా, ఇక్కడి వైద్యులు తప్పుదోవ పట్టించి తనకు న్యాయం జరగకుండా అడ్డుకొన్నారని డక్కిలికి చెందిన శ్రీనివాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

గూడూరు - రాపూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



దెబ్బతిన రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గూడూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గూడూరు - రాపూరు మినీ బైపాస్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గూడూరు - రాపూరు మార్గంలో గుంతలు పడిన చోట సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు మినీబైపాస్ రోడ్డు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే చెన్నూరు, తిప్పవరప్పాడు రోడ్డు కూడా గుంతలమయంగా మారిం దని, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాతసంత రోడ్డులో సిమెంటు రోడ్డును నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, శ్రీనివాసులు, మణి, సురేష్, శీనయ్య, చంద్రయ్య, కోటి తదితరులు పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

సూళ్లూరుపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో మంగళవారం రాత్రి రెండు దుకాణాల్లో చోరీ జరిగింది. జీఎన్‌టీ రోడ్డులో ఉన్న ఎలక్ట్రికల్ షాపు తాళాలు పగలగొట్టి సుమారు రూ.లక్ష నగదు అపహరించుకొని వెళారు. అదేవిధంగా షార్ రోడ్డులో కోళ్లమిట్ట వద్దనున్న మెడికల్ షాపులో రూ.20 వేలు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పోలీసులు చోరీ జరిగిన దుకాణాలను పరిశీలించారు. సీసీ కెమెరాలో నమోదైన పుటేజ్‌లు పరిశీలించగా ఓ యువకుడు రాత్రి 12 గంటల సమయంలో చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెందోడులో పల్లె పండుగ వారోత్సవాలు

కోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో బుధవారం పల్లె పండుగ వారోత్సవాలు జరిగాయి. రూ.9.60 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకులు శంకుస్థాపన చేఆరు. ఎంపీడీవో వేణు, టీడీపీ నేతలు వాకా విజయభాస్కర్‌రెడ్డి, బందిలి రఘురామయ్య, వెంకటకృష్ణారెడ్డి, మస్తాన్‌బాషా, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, పీఆర్ ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

హరిప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటాం: పాశం



హరిప్రసాద్ మృదేహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పాశం

చిల్లకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచారమ్మపేట గ్రామంలో హత్యకు గురైన టీడీపీ కార్యకర్త హరిప్రసాద్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం హరిప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త హరిప్రసాద్ హత్యచేయడం దారుణమన్నారు. హత్యకు కారణమైన ప్రతిఒక్కరిని కఠినంగా శిక్షించాలన్నారు. హరిప్రసాద్ కుటుంబానికి అండగా ఉండి వారిని అన్ని విధాల పార్టీ ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా ప్రశాంతవాతావరణం నెలకొల్పేలా పోలీసులు చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పెంచలకోన ఆలయట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరిప్రసాద్ కుటుంబ సభ్యులకు పరామర్శ

చిల్లకూరు, అక్టోబరు 23: మండలంలోని నాంచారమ్మపేట గ్రామంలో హత్యకు గురైన హరిప్రసాద్ కుటుంసభ్యులను ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు. ఎమ్మార్పీఎస్ నేత గోవిందు శ్రీనివాసులు మాట్లాడుతూ హరిప్రసాద్‌పై దాడిచేసి హత్యచేయడం దారుణమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లికార్జున, కనుపూరు శివ పాల్గొన్నారు.

రైతులకు సలహాలు, సూచనలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మూరు, అయ్యప్పరెడ్డిపాళెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్ రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. జీవన ఎరువుల వాడకంతో రసాయన ఎరువులు తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి టీడీపీ గుర్తింపునిస్తుంది: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి టీడీపీ తగిన గుర్తింపునిస్తుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. టీడీపీ సభ్యత్వం కలిగిన వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5లక్షల వరకు బీమా సౌకర్యం, దహన సంస్కారాలకు రూ.10వేల ఆర్థిక సాయం పార్టీ అందజేస్తుందన్నారు. నియోజకవర్గ పరిధిలో టీడీపీ గెలుపునకు మహిళా నేతలు ఎంతో కష్టపడి పనిచేశారని, వారికి సరైన గౌరవం, అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో కూటమి భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. త్వరలో నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని, ఓటరు సభ్యత్వాన్ని త్వరితగతిన పూర్తిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, వెంకటేశ్వర్లురాజు, సర్వోత్తమరెడ్డి, బిల్లు చెంచురామయ్య, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, మట్టం శ్రావణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకోవాలి: కలెక్టర్

బాలాయపల్లి, అక్టోబరు23 (ఆంధ్రజోతి): గ్రామీణ ప్రాంతాల్లో భూవివాదాలను సానుకూల దృక్పథంతో పరిష్కరించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. బుధవారం ఆయన బాలాయపల్లి మండలంలో పర్యటించారు. ముందుగా శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఫ్రీహోల్డ్ భూములపై సమీక్షించారు. అనంతరం మండల పరిధిలోని హస్తకావేరి గ్రామంలో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించి ఇరువర్గాలతో చర్చించారు. గ్రామానికి చెందిన ఆలం శ్రీనివాసులు, కొర్రపాటి రాజేష్ భూ సమస్యలపై ముఖ్యమంత్రి కార్యాలయంలో అర్జీలు అందజేయడంతో వారితో నేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. సంబంధిత భూసమస్యలపై క్షేత్రస్థాయిలో విచారించి తనకు నివేదికలు అందజేయాలని తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌ఐ శ్రీకాంత్, సర్వేయర్ రామారావు, వీఆర్‌వో ఈశ్వరరాజు ఉన్నారు.

సేంద్రియ విధానంపై అవగాహన పెంచుకోవాలి

కోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని కర్లపూడి, ఉత్తమనెల్లూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. నారుమడులకు తెలుగు సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నాయుడుపేట పట్టణానికి చెందిన జయపాల్ మోటారు సైకిల్‌పై మేనకూరుకు వెళ్తుండగా మరో మోటారు సైకిల్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన జయపాల్‌ను 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వృద్ధాశ్రమానికి మంచాల వితరణ

గూడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమానికి బుధవారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో మురళీనాయుడు దాతృత్వంతో వైరు మంచాలను అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ చలికాలంలో వృద్ధులకు ఇబ్బంది కలగకుండా ఉండేలా వారికి అవసరమైన వైరు మంచాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యమంలో శ్రీనివాసులు, రాము, కుమార్, ప్రభాకర్, నాగరాజు, కల్యాణి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలుపు మందుల వాడకంపై శిక్షణ

చిల్లకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కలుపు మందులను అధికంగా వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఉడతావారిపాళెంలో రైతులకు కలుపు మందుల వాడకంపై శిక్షణ ఇచ్చారు. కలుపు మందులు నేలను కాలుష్యం చేసి నేల నిర్మాణాన్ని, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. సరైన రీతిలో నేలను తయారు చేసుకుంటే కలుపు బెడదను తగ్గించవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాలరావు, ఏవో భవానీ, సర్పంచు వజ్రమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో జేసీ తనిఖీలు

సూళ్లూరుపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాలను బుధవారం జేసీ శుభం బన్సల్ తనిఖీ చేశారు. సత్యవేడుకు వెళ్తున్న ఆయన సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆగారు. రైల్వేగేటు అవతల వైపు తహసీల్దార్ కార్యాలయం ఉండడంతో వాహనం ఆపేసి నడుచుకొంటూ వెళ్లారు. జేసీ నడుచుకొంటూ రావడాన్ని గమనించిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ముందుగా డీటీ, ఆర్‌ఐ చాంబర్ల వద్దకెళ్లిన జేసీ అనంతరం తహసీల్దార్ నరసింహరావుతో మాట్లారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడి వెళ్లారు.

కందలవారిపల్లిలో రీసర్వే గ్రామసభ

డక్కిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందలవారిపల్లిలో బుధవారం భూముల రీసర్వే గ్రామసభ నిర్వహించారు. రీసర్వేకి సంబంధించి 12 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గ్రామసభల్లో 19 అంశాలకు సంబంధించి రికార్డులను క్షణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. రికార్డులన్నీ సవ్యంగా వుంటే తక్షణమే బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్ రాజగోపాల్, గ్రామ సర్పంచ్ వేమమ్మ, టీడీపీ నాయకులు డక్కిలి చంద్రారెడ్డి, దండవోలు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన ర్యాలీ

సూళ్లూరుపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించిన ఎస్‌ఐ బ్రహ్మానాయుడుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం న్యాయవాదులు ర్యాలీ చేపట్టారు. కోర్టు వద్ద నుంచి బజారు వీధుల్లో ఎస్‌ఐకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీరాములయాదవ్, గణపతి, సుదర్శనరావు, ప్రసాద్, ధర్మాప్రసాద్, లక్ష్మయ్య, ఈశ్వరమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్లతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్

నాయుడుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విజ్ఞాన సృజనాత్మకతకు సైన్స్‌ఫేర్లు ఎంతగానో దోహదపడుతాయని మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ అన్నారు. నాయుడుపేట ఎల్‌ఏ సాగరంలోని బాలుర గురుకులంలో బుధవారం జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించారు. సైన్స్ మ్యాథ్స్ ఇంగ్లీషు, తెలుగు, ఆర్ట్స్, క్రాఫ్ట్, సోషల్ తదితర అంశాలపై 166 రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. జడ్జీలుగా డాక్టర్ యు.నరసింహులు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్రీరాములు, మాధవి వ్యవహరించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా డీసీవో పద్మజ, గురుకుల ప్రిన్సిపాల్ దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

శీతల శవపేటికల ఏర్పాటు

గూడూరు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండేలా నెల్లటూరు గ్రామంలో రెండు శీతల శవపేటికలను సంహపురిరెడ్డి సంక్షేమ సంఘం నేతలు బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్ధనరెడ్డి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, సిద్దారెడ్డి, మస్తాన్‌రెడ్డి, సనత్ కుమార్‌రెడ్డి, హరినాథరెడ్డి, దశరధరామిరెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు అభినందన



కోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు వంశీధర్‌రెడ్డి, చెందు, చందన దక్షిణ ప్రాంత అంతర్ రాష్ట్రాల విశ్వవిద్యాలయాల టెబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధి పతులు క్రీడాకారులను అభినందించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

డీఎస్సీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

గూడూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ అధికారి మనోజ్ బుధవారం తెలిపారు. టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా డీఎస్సీ శిక్షణ అందిస్తుందన్నారు. శిక్షణ తీసుకునేవారు ఈనెల 25వ తేదీ లోగా జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇసుక డంపింగ్ యార్డ్ పరిశీలన



గూడలి స్వర్ణముఖిలో ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు

కోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి స్వర్ణముఖిలో బుధవారం ఇసుక డంపింగ్ యార్డ్‌లను మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి నదిలో ఇసుకరీచ్ ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నది నుంచి తీసిన ఇసుకను డంపింగ్ చేసేందుకు సర్వే నెంబరు 408లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు జయజయ రావు, మైనింగ్ ఏడీ శ్రీనివాసులు, సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గూడూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం సినీహీరో ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా ఆయ అభిమాన సంఘం నాయకుడు యోగి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ సినీహీరోల పుట్టిరోజు సందర్భంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉదయ్‌భాస్కర్, శ్రీహరి, ప్రభాస్ అభిమాన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చెన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. బుధవారం చెన్నూరులో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా ఆధార్ నమోదుతో పాటు మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నా చెన్నూరు ప్రజలు గూడూరుకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సూచనల మేరకు చెన్నూరులో శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి, హేమకుమార్‌రెడ్డి, కృష్ణయ్య, రమణయ్య, అశోక్, కృష్ణ మూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యపై వీడియో కాన్ఫరెన్స్

కోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో బుధవారం ఎంఈవో మస్తానయ్య ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పాఠశాలల్లో మౌళిక వసతులు, గుణాత్మక విద్య తదితర అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

కలసికట్టుగా అభివృద్ధికి కృషి: బీజేపీ

కోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి అందరితో కలిసి పనిచేస్తామని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొమారి కోటేశ్వరరావు అన్నారు. కోటలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీజేపీ భాగస్వామ్య ఎన్డీఏ పక్షాలతో పనిచేస్తూ ముందడుగు వేస్తుందన్నారు. తిరుపతి జిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలలో 75శాతం మంది ప్రజలు ఏపార్టీకి చెందని వారిగా ఉన్నారన్నారు. అందరి అభివృద్ధి కోసం కలసికట్టుగా పనిచేసి ప్రధాని నరేంద్రమోదీ ఆశయసాధనకు పాటుపడుతామని కోటేశ్వరరావు అన్నారు.

అత్తివరంలో పొలం పిలుస్తోంది

ఓజిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలోని అత్తివరం, ఏనుగువాడ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో రైతులు, మహిళలు పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులకు వివిధ పంటల సాగుతో పాటు సాగులో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యత, పంట మార్పిడి వంటి విషయాలు తెలియజేశారు. ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు.

సమస్యల పరిష్కారానికే మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు మండలంలో జరిగిన పురోగతిని చదివి వినిపించారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం తాగునీటి వసతులపై శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రమీలా రాణి, తహసీల్దార్ ద్వారకా నాధ్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇటుకుల పరిశ్రమలో తనిఖీలు

కోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దాదా రాయిగుంట సమీపంలో ఉన్న ఇటుకుల పరిశ్రమను తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు బుధవారం తనిఖీ చేశారు. ఇటుకుల పరిశ్రమ వల్ల కాలుష్యంతో అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు పరిశ్రమను తనిఖీ చేశారు.